www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 సంచిక : 16 విజయవాడ 20-12-2012 పేజీలు : 8 వెల : రు 5.00

లోపలి పేజీల్లో...

◈ ప్రపంచ దేశాలలో కార్మికుల ఆందోళనలు
◈ భారత దేశంలో కార్మికుల ఆందోళనలు
◈ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సదస్సు తీర్మానాలు
◈ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల 30వ వర్ధంతి సభ
◈ బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో సిపిఐ(ఎం-ఎల్) కార్యకలాపాలు

## దోపిడీ వ్యవస్థ రద్దుకై పోరాడటం ద్వారానే బలాత్కారాల భారతంలో మహిళలకు సమాన హక్కులు సాధ్యం

**మొన్న** దేశరాజధాని ఢిల్లీ నగరంలో ఒక పారా మెడికల్ విద్యార్థినిని, ప్రయాణించే బస్సులో, ఏడుగురు ముష్కరులు మూకుమ్మడిగా బలాత్కరించి, కదిలే బస్సులోంచి ఆమెను కిందికి విసిరేశారు. ఆమె ప్రస్తుతం చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

అంతకు ఒక వారం ముందు అమృత్‌సర్‌లో రంజిత్‌సింగ్ రానా అనే అకాలీదళ్ ప్రధాన కార్యదర్శి, మరికొందరు దుండగులతో కలసి, రవీంద్రపాల్‌సింగ్ అనే ఒక పోలీసు ఎ.ఎస్.ఐ. కూతురును వేధిస్తుండగా, ఆమెను రక్షించటానికి వెళ్ళిన రవీంద్రపాల్‌సింగుని, పోలీస్‌స్టేషన్ ఎదుటే తుపాకీతో కాల్చిచంపారు.

**నిన్న** బెంగుళూరు నగరంలో 15 సంవత్సరాల బాలికను, ఒక కిరాణాకొట్టు యజమాని బలాత్కరించాడు. బీహార్‌లోని, బరారాజిల్లాలో ఇద్దరు బాలికలను (ఒకరికి 10 సంవత్సరాల వయస్సు, మరొకరికి 15 సంవత్సరాల వయస్సు) ముగ్గురు ముష్కరులు సామూహికంగా బలాత్కారం చేశారు. ఈ దురంతంలో 10 సంవత్సరాల బాలిక చనిపోయింది. మరో బాలిక చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రం-సిలిగురి జిల్లాలోని, రామజోతా గ్రామంలో, 24 సంవత్సరాల యువతిని, ఆగంతకులు ఎత్తుకుపోయి మాకుమ్మడిగా బలాత్కరించటమేకాక, ఆమెకు నిప్పుపెట్టి అంటించివేశారు.

**ఈవాళ** నల్గొండజిల్లాలోని, రామన్నపేట మండలంలోగల మోతినేనిగూడెంలో, మూడేళ్ళ పసికందును 14 సంవత్సరాల వయస్సు వున్న యిద్దరు బాలురు ఆమెకు చాక్లెట్లు యిస్తామని ఆశజూపి తీసుకెళ్ళి బలాత్కారం జరిపారు.

ఈ ఘటనలన్నీ మన సమాజం ఎంతటి నికృష్టంగా కుళ్ళిపోయిందోనన్న విషయానికి అద్దం పడుతున్నాయి.

ఇటువంటి ఘటనలు నిత్యకృత్యమయిన మనదేశంలో, సమాజానికి కూడా యివి అంతగా పట్టని సాధారణ విషయాలైపోయాయి. మీడియా ఈ ఘటనలను గురించి సంచలనాత్మక కథనాలుగా ప్రచారం చేసినపుడు, కొంత ఆగ్రహించటం, ఆనక మిన్నకుండటం మామూలైపోయింది.

నిజానికి సమాజంలో సగభాగమైన మహిళలకు ఈ విధంగా రక్షణ, భద్రతలు కరవై, పురుషాధిక్య సమాజపు దయాదాక్షిణ్యాలపై జీవనాన్ని సాగించాల్సిన దుస్థితి, మానవ సమాజానికే సిగ్గుచేటైన విషయం.

నిరంతరం దేశీయ సాంప్రదాయాల పేరిట స్త్రీని, పురుషుని అదుపులో, రక్షణలో వుండాల్సిన, పరాధీన స్థితిలో ఎటువంటి హక్కులూ, స్వేచ్ఛలూలేని చట్రంలో బిగించిన మనదేశపు అర్ధఫ్యూడల్ వ్యవస్థ, ఈ వ్యవస్థ పునాదిపై నిలబడి అధికారాన్ని చెలాయిస్తున్న సామ్రాజ్యవాద వ్యవస్థకు చెందిన ఆధునిక సంస్కృతి పేరిట చలామణీ అయ్యే, స్త్రీని భోగవస్తువుగా, వినిమయవస్తువుగా, పురుషుడికి కేవలం ఆనందాన్నిచ్చే సాధనంగా పరిగణించే వికృత పాశ్చాత్య సంస్కృతిల 'సమ్మిళిత సంకర' సంస్కృతే నేడు ఈ రకమయిన దురాగతాలు నానాటికీ పెరిగిపోవటానికి మూలకారణం అన్నది నిర్వివాదాంశం.

దేశంలో తగు చట్టాలు లేకపోవటంవలన పెచ్చరిల్లుతున్న సామాజిక రుగ్మతకాదు యిది. మౌలికంగా స్త్రీని, పురుషునికన్నా తక్కువైన, అధమస్థానంలో వుంచాల్సిన వ్యక్తిగా పరిగణించే భావజాలమే యిందుకు కారణమవుతోంది.

నిజమే, యీ ఢిల్లీ సంఘటనపైన వివిధ పాలకవర్గ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పార్లమెంటులో గగ్గోలుపెట్టి, దోషులను కఠినంగా శిక్షించటానికి పట్టుబట్టడం అన్నది జరిగింది. అయితే ఎటువంటి హక్కులూ లేకుండా, దారుణంగా, దుర్మార్గంగా మహిళలు బలాత్కారాలకు గురవుతూ, మరణాలకు గురిచేయబడుతున్నందుకు కాదు వీరి ఆవేశం, ఆక్రోశాలు! ఈ ఘటనలవలన ఆ స్త్రీలకు చెందిన కుటుంబాల గౌరవం మంటకల్సిందన్నదే వీరి బాధ. దుర్మార్గ, దురంతాలకు గురైన స్త్రీల 'శీల పవిత్రత రక్షణ' అన్నదే వీరి ఆవేశానికి కారణం. దానికి 'ఓట్లసంపాదన' అనే లక్ష్యం తోడవటం అన్నదే వారిని అంతటి ఆవేశానికి గురిచేసింది.

సమీప గతంలో ఈ రాజకీయపార్టీల నాయకులే, ఈ పోలీసు అధికారులే, ఈ పంచాయితీ పెద్దలే, ఈ క్రిందివిధంగా సెలవిచ్చారు.

ఆ మధ్యన, సమర్థురాలైన పోలీస్ ఉన్నతాధికారిగా పేరొందిన కిరణ్‌బేడీ, ప్రస్తుతం తాను చేపట్టిన 'అవినీతి వ్యతిరేక ఆందోళన' ప్రచార సందర్భంగా స్త్రీల బలాత్కారాలు అన్నవి కొద్దిపాటి విషయాలుగా కొట్టిపారేసింది.

ఒక హర్యానా శాసనసభ్యుడు "స్త్రీలో మానసిక ఎదుగుదల లేకపోవటంవల్లనే వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయి" అంటూ తాపీగా సెలవిచ్చాడు.

మరోవైపు, అదేరోజు, ఫైర్‌బ్రాండ్ మహిళా ముఖ్యమంత్రిగా పేరొందిన మమతాబెనర్జీ 'స్త్రీ పురుషులు కలసిమెలసి తిరుగుతూండటం వల్లనే బలాత్కారాలు జరుగుతున్నాయ'ంటూ విషయాన్ని తేల్చిపారేసింది.

మరోవైపు 16 ఏళ్ళలోపు వయస్సులో పెళ్ళిచేస్తే బలాత్కారాలే జరగవంటూ హర్యానాలోని 'ఖఫ్' పంచాయితీలు ఘోషిస్తున్నాయి.

ఇంకోవైపు, బలాత్కారానికి గురైన బాధితురాలి శీలానికి వెలకట్టడంద్వారా(అక్టోబర్ 15న, పంజాబ్‌లోని, కహీగ్రామం, ఫతేబాద్ జిల్లా) గ్రామపంచాయితీలు యీ 'బలాత్కారాల' సమస్యను 'పరిష్కరించి'పారేస్తున్నాయి.

సాంస్కృతిక పోలీసులుగా తమను తాము ప్రకటించుకున్న సంస్థలు మహిళల వేష భాషలే ఈ బలాత్కారాలను ప్రోత్సహిస్తున్నట్టుగా చూపెడుతూ వివిధ హెచ్చరికలు జారీచేస్తున్నాయి.

ఆగస్టు నెలలో, రాంచీలోని ఝార్ఖండ్ ముక్తిసంఘ్ అనే సంస్థ మహిళలు జీన్స్ ధరిస్తే యాసిడ్ దాడులు చేస్తామంటూ హెచ్చరికలు జారీచేసింది.

అక్టోబరు నెలలో ఒక బహుజన సమాజ్‌వాద పార్టీ ఎం.పీ., 'అమ్మాయిలకు మొబైల్‌ఫోన్లు ఇవ్వకండి' అంటూ పిలుపునిచ్చాడు.

హర్యానాలోని, బాగ్‌పథ్‌జిల్లాలోని ఒక పంచాయితీ 40 ఏళ్ళలోపు మహిళలు షాపింగ్‌కోసం బయటకు రావటంపై, వీధిలో మొబైల్ ఫోన్లు వినియోగించటంపై నిషేధం విధించింది.

ఛత్తీస్‌ఘడ్‌లో పండరితారాయి గ్రామంలోని సాహు కులానికి చెందిన కుల పంచాయితీ, "స్త్రీలు తలనుండి బొటనవ్రేలుదాకా కప్పుకోవాలనీ, ఆరకంగా వారు పురుషులలో లైంగిక వాంఛలు పెరగకుండా జాగ్రత్తపడాలనీ" ఆజ్ఞ జారీచేసింది.

హర్యానాలో మరో ఖఫ్ పంచాయితీ అయితే "నూడుల్స్" లాంటి ఆహారం తింటున్నందువల్లనే బలాత్కారాలు పెరిగిపోతున్నాయంటూ ప్రకటించింది.

ఛత్తీస్‌ఘడ్ పోలీస్ ట్రైనింగ్ అకాడమీలో, "ఆఫీసు పని సమయాల్లో మహిళలు పాశ్చాత్య దుస్తులూ, జీన్సు ధరించరాదు" అంటూ ఉత్తర్వులు జారీచేశారు.

(తరువాయి 2వ పేజీలో)

### సంపాదకీయం

## వియత్నాం నుండి న్యూటౌన్ వరకూ...

ఒబామా కంటనీరుకారింది. ఆరేడేళ్ల వయసున్న 20 మంది పసివారి ఊచకోతకు (ఏమిటో తెలియని) "అర్ధవంత చర్య"ను తీసుకుంటానని చెప్పాడు. మొదటి ఐదేళ్ల పాలనలో ఆయుధ బేహారుల జోలికెళ్లని ఒబామా చర్య ఎంత అర్ధవంతంగా ఉండబోతుందో అర్థంకాకపోదు.

ఒక యువకుడు మూడు ఆయుధాలతో పాఠశాలలో ప్రవేశించి విచక్షణా రహితంగా కాల్పులు సాగించిన ఘటన అమెరికా సమాజానికి కొత్తదేమీకాదు. దీనికి బాధ్యతెవరిదన్నదే తేలాల్సిన ప్రశ్న.

నేరస్తుడైన యువకుడు మానసికరోగి; అతని తల్లి కూడా మానసిక వైకల్యంతో వుందంటూ అమెరికా పోలీసుల కథనాలు వెన్వెంటనే వెలువడ్డాయి. వ్యక్తిగత స్థాయి నేరంగా చిత్రించి వ్యవస్థాగత కారణాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో వున్నారు.

గత ఏడాది అమెరికాలో తుపాకీ కాల్పులతో 11 వేలమంది హత్యచేయబడ్డారు. మరో 20 వేలమంది తుపాకీతో ఆత్మహత్య లేదా ప్రమాదవశాత్తు తుపాకీ పేలి మరణించారు. గాయపడినవారి సంఖ్య చెప్పనక్కరలేదు. తుపాకీ కొనుగోలుకు పోలీసుల ముందస్తు అనుమతి పొందాలని 80 శాతం మంది, తుపాకీ కొనుగోలుదారుల గత జీవితాన్ని పోలీసులు పరిశీలించాలని 90 శాతం మంది అమెరికా పౌరులు కోరుతున్నారు. అయినా ఈ దిశగా చర్యల గురించి ఒక్క అమెరికా ప్రతినిధి కూడా మాట్లాడంలేదు. 1960ల్లో అధ్యక్షుడు లిండన్ జాన్సన్ తుపాకీ కొనుగోళ్ళకు లైసెన్సు విధానాన్ని పెట్టాలని తీవ్రంగా వాదించాడు. అయినా అతను పెట్టిన బిల్లు వీగిపోయింది. 1990లలో బిల్‌క్లింటన్ రెండు బిల్లులు పెట్టి చట్టాలు చేయగలిగాడు కానీ అవి ఎందుకూ కొరగానంత బలహీనంగా వున్నాయి.

ఉదయాన్నే ఉల్లాసంగా బడికొచ్చి చదువుకుంటున్న పసిపిల్లలు శవాలుగా మారటం అమెరికా ప్రజలను దిగ్భ్రాంతులను చేసింది. సామ్రాజ్యవాద పాలకులు మాత్రం ప్రకటనలతో సరిపుచ్చారు. కోటి 40 లక్షల జనాభాగల దక్షిణ వియత్నాంలో అమెరికా యుద్ధ విమానాలు కురిపించిన బాంబులకు రెండున్నర లక్షల మంది బాలలు నిహతులయ్యారు. ఏడున్నర లక్షలమంది బాలలు అంగవికలురయ్యారు. 1967 సెప్టెంబరు 27న ఉదయం ఏడున్నర గంటలకు హతుంగ్ జిల్లాలోని హుపూగ్రామంలోని బడిపై నాలుగు యుద్ధవిమానాలు, నాలుగు బాంబులను వేశాయి. పడ్డవెంటనే ఒక్కో బాంబు 2400 తుపాకీ గుండ్లను వెదజల్లింది. ఈ దాడిలో 30మంది విద్యార్థులు మరణించగా, 33 మంది గాయపడ్డారు.

ఇరాక్‌పై ఆంక్షలు విధించి ఔషధాలు అందకుండా చేసినందున ఇరాక్‌లో వైద్యమందక 5 లక్షల మంది పిల్లల మరణాలకు అమెరికా కారణమైంది. ఇప్పుడు ఇరాన్‌పై ఆంక్షలతో పసిపిల్లలు వైద్యమందక మరణిస్తున్నారు.

ఈ మారణకాండనే అమెరికా సైన్యపు వీరోచిత చర్యలుగా అమెరికా ప్రజలను నమ్మించే ప్రచారం సాగించిన, పసిమనసులను తుపాకీతో ఆత్మరక్షణ అన్న భావనతో కలుషితం చేసిన అమెరికా పాలకుల "పాపానికి" అమెరికా ప్రజలు "మూల్యం" చెల్లిస్తూనే వున్నారు.

ఈ పాపాలన్నింటినీ ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట సమర్థించిన అమెరికా సామ్రాజ్యవాద పాలకుల బాకా న్యూయార్క్‌టైమ్స్ పత్రిక న్యూ టౌన్‌లో విద్యార్థుల ఊచకోత వార్తకు "పసిపిల్లలపై హింసకు మించిన నేరముండదు. ఇంత దారుణంగా బిడ్డను కోల్పోయిన తల్లిపడే వేదనకు మించిన విషాద ముండదు" అన్న శీర్షిక పెట్టింది.

అవును. ఇదంతటి విషాదమే. ఇది అమెరికా తల్లుల విషాదమే కాదు, ప్రపంచ ప్రజలందరి విషాదం. 1990 నుండి 2003 వరకూ అమెరికా సాగించిన యుద్ధాలలో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియా, యుగోస్లావియాలలో నిహతులైన బాలల సంఖ్య ఎంతో ఈనాటికీ చెప్పేవారులేరు. అమెరికా వేసిన పేలకుండా ఉండిపోయిన బాంబులకు, పెట్టిన ముందు పాతర్లకూ రోజూ పసి బాలలు బలవుతూనే వున్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాలన్నింటిలోకీ అత్యంత హింసాత్మక దేశం అమెరికా. అమెరికా ఖండ ఆక్రమణకు సాగిన ఆదివాసులైన రెడ్‌ఇండియన్ల ఊచకోతనుండీ, ఆఫ్రికా ప్రజలపై బానిసత్వ సంకెళ్లవరకూ, సామ్రాజ్యవాద యుద్ధాలు, దురాక్రమణ, విదేశీ ప్రభుత్వాల కూల్చివేతల వరకూ, బందీల చిత్రహింసల వరకూ అమెరికా చరిత్ర అంతా ఇంటాబయటా క్రూరహింసతో నిండిపోయింది.

కానీ అమెరికా ప్రజలు ఈ తుపాకీ సంస్కృతి సాగాలని కోరుకోవటంలేదు. అమెరికా దుర్మార్గ పాలకుల దుశ్చర్యలనుండి రక్షణకు తమకు తుపాకులు కలిగివుండే హక్కు కలిగివుండాలని కోరుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో అవి ప్రజలకు అవసరమౌతాయి గనుక. అయితే తుపాకీలు కలిగివుండటమూ, వాటి వినియోగాలపై(అవి వుండే పోలీసులూ, సైన్యంతోసహా) లైసెన్సులువంటి కఠినతర పర్యవేక్షణ వుండాలని కోరుకుంటున్నారు. పాలకులు పెంచి పోషిస్తున్న తుపాకీ సంస్కృతి తొలగిపోవాలని కోరుకుంటున్నారు. ఆయుధ వ్యాపారుల నిధులు మింగుతున్న రాజకీయ నేతలు ఈ విధానం రూపొందకుండా అడ్డుకుంటున్నారని అమెరికన్ ప్రజలు భావిస్తున్నట్లు ఇటీవలి ఒక సర్వే తెలిపింది.

అయితే అమెరికా దేశంలోనూ, బయటా కూడా ఆయుధాల అమ్మకంలో అమెరికా సామ్రాజ్యవాదులదే ప్రథమస్థానం. అత్యంత పెద్ద సైనిక వ్యయంచేసేది అమెరికా పాలకులే. అమెరికా ప్రజలు ఈ బూర్జువావర్గ నిరంకుశపాలనకు వ్యతిరేకంగా తమ పోరు సాగించనంత వరకూ తల్లులందరికీ కడుపుకోత తప్పదు; బిడ్డల ఆటపాటలతో ఆనందించేరోజు రాదు. ✡

## పత్రికా ప్రకటన — "పెద్ద లక్ష్యంతో మొదలైన చిన్న ప్రయత్నం"

*__బిటి__ ప్రత్తి రకానికి పెద్దఎత్తున ప్రచారం సాగిస్తూ, దానికి మరో ప్రత్యామ్నాయంలేదన్న తప్పుడు భావాన్ని వ్యాప్తిచేస్తున్న తరుణంలో, 95 శాతం విస్తీర్ణం బిటి రకం క్రిందకు వచ్చిన సమయంలో, బిటివల్ల ప్రత్తి రైతులు నష్టపోతున్న వాస్తవాన్ని తొక్కిపడుతున్నప్పుడు, రైతుహక్కుల రక్షణ వేదిక గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా చేసిన ప్రయత్నం అభినందనీయం. రైతాంగమే విత్తనాలు తయారుచేసుకొని, కంపెనీల కబంధహస్తాలనుండి బయటపడి సాగును లాభదాయకం చేసుకోవచ్చునని ఈ ప్రయోగం చూపింది. ఈ సందర్భంగా 'రైతుహక్కుల రక్షణ కమిటీ' పంపిన పత్రికా ప్రకటనను ఇస్తున్నాము.*

**-సంపాదకుడు**

సమస్యలతో కూడిన పత్తి సాగులో, పంట "విత్తనం" కంపెనీల వ్యాపార వస్తువుగా మారింది. ముఖ్యంగా బిటి హైబ్రిడ్ లేనిదే పత్తిసాగు సాధ్యంకాదనే వరవడిలో రైతులున్నారు. ఈ దశలో గుంటూరు జిల్లా రైతులు కంపెనీ విత్తనాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించబడిన పత్తి రకాన్ని ముఖ్యంగా ప్రభుత్వ పరిశోధనా స్థానం నుండి విడుదలైన వాటిని ప్రస్తుత పంటకాలంలో సాగుచేయటం సాహసమని చెప్పవచ్చు. పంట రకాల వైవిధ్యతను, సుస్థిర సాగుపద్ధతుల్ని అటకెక్కించిన కంపెనీల ప్రచార హోరులో, బిటి జన్యువులేని సూటి రకాల్ని రైతుల పొలాల్లో చూడగలగడం పరిశోధనారంగ నిపుణులకు, విస్తరణరంగ ఉద్యోగులకు ఆశ్చర్యం కలిగిస్తున్నది.

ఈ పంట కాలంలో దాదాపు 90 గ్రామాల్లోని 130 మంది పత్తి సాగుదారులు, 150 ఎకరాల్లో బిటి యేతర పత్తి రకాన్ని సాగుచేశారు. ఈ రకాల్లో నరశింహ, శివనంది, నంద్యాల -1938 ముఖ్యమైనవి. వీటిని సాగుచేసే చొరవను ఈ రైతులు 'రైతురక్షణ వేదిక' నుండి పొందారు. ఈ వేదిక రూపొందించిన పరస్పర సహకార సంఘంలో వీరందరూ సభ్యులు. వీరి లక్ష్యం పంట విత్తనాలపై రైతులకు, ప్రజాప్రభుత్వాలకు హక్కు వుండేట్లు చేయడం.

6-12-12న పెదగొట్టిపాడు (పత్తిపాడు మండలం) యన్.సదాశివరావు ద్వారా సాగుచేయబడిన నంద్యాల-1938 పత్తిపొలంలో నిర్వహించబడిన క్షేత్రోత్సవంలో ఈ సంఘ సభ్యులు, ఈ ఉత్సవానికి అతిధులుగా విచ్చేసిన లాంఫాం శాస్త్రవేత్తల ముందు వారి అనుభవాలను వ్యక్తపరిచారు. ముఖ్యంగా బిటియేతర పత్తిసాగులో వచ్చిన అనుభవాల్ని బొల్లు శంకరరావు (బొప్పన), తియ్యగూర శ్రీనివాసరెడ్డి (మానుకొండవారిపాలెం), వడ్లమూడి శివమాధవరావు (బేజాద్‌పురం), చిరుమామిళ్ళ వెంకట్రావు (వింజనంపాడు), వట్టి సుధాకర్ (కొండేపూడి), కందుల విఠల్‌రెడ్డి (వడ్డమాను) వివరించారు. అలానే ఈ ఉత్సవ నిర్వహణకు సహకారసంఘం తరపున ఏర్పాట్లు చేసిన నిమ్మగడ్డ సదాశివరావు నంద్యాల-1938 పత్తిరకం సాగులో తానెదుర్కున్న సమస్యల్ని వివరించారు. తాను ఈ క్షేత్రోత్సవంలో పాల్గొని తోటి రైతులకు ప్రేరణగా నిలవడం తనకెంతో మనోధైర్యాన్నిచ్చిందని వివరించారు. ఈ వరవడి, కంపెనీల ఏకపక్ష వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయగలదని తాను నమ్ముతున్నట్లు వివరించారు. తాను సాగుచేసిన రైతు విత్తన ఆధారిత పత్తిపైరు సాగుకు ఎకరానికి 32,800/- ఖర్చుయితే, కంపెనీ విత్తన ఆధారిత పత్తిపైరు సాగుకు 38,600/- ఖర్చయిందని వివరించాడు. ఈ రెండు పంటల దిగుబడులు సమానంగా (12-15 క్విం/ఎ) వుంటాయని అనుకొంటున్నట్లు పంట క్షేత్రాన్ని చూసిన రైతులందరూ తెలిపారు.

ఈ తరహా నమూనా క్షేత్రాలద్వారా రైతులకు ఒక విధంగా ప్రత్యామ్నాయ పంట సాగు పద్ధతులపైన (ముఖ్యంగా స్వంత విత్తనాల తయారీపట్ల శ్రద్ధ) ప్రభుత్వ పరిశోధన, విస్తరణ రంగాలపై నమ్మకం కలుగుతుందని ఈ క్షేత్ర ప్రదర్శనకు ముఖ్య అతిథిగా వచ్చిన లాంఫాం శాస్త్రవేత్త డా॥వి.చెంగారెడ్డిగారు వివరించారు. తాము వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా పత్తి పరిశోధనలో ప్రగతి సాధించే ప్రయత్నానికి, తమ పంట రకాల్ని కాపాడుకొనేందుకు ఇటువంటి స్వయం సహాయక సహకార సంఘాలు అవసరమన్నారు. మరో అతిథిగా విచ్చేసిన డా॥జి.యం.వి.ప్రసాదరావు(పత్తి ముఖ్యశాస్త్రవేత్త) ఈ సహకార సంఘ సభ్యుల ప్రయత్నాల ద్వారా తామెంతో స్ఫూర్తి పొందుతున్నట్లు వివరించారు.

ఈ ఉత్సవంలో అనేక పరిసర గ్రామాల రైతులతోపాటు రైతురక్షణ వేదిక ముఖ్య కార్యనిర్వాహకులుగా వున్న రైతు సంఘాల కార్యకర్తలు, విశ్రాంత వ్యవసాయరంగ నిపుణులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ క్షేత్ర ఉత్సవ సమావేశం శ్రీ సి.హెచ్.పరమేశ్వరరెడ్డి (విత్తనరంగ మాజీ అధికారి) గారి అధ్యక్షతన జరిగింది. ✡

## ఉత్తర ప్రదేశ్ — ప్రజా సమస్యల పరిష్కారానికై ధర్నా

**లక్నో, 7-11-12 :**

నవంబరు 7వ తేదీకి ప్రపంచ చరిత్రలో ఒక విశిష్టస్థానముంది. 1917లో ఈ చారిత్రక దినాన కామ్రేడ్ లెనిన్ నాయకత్వంలో రష్యన్ కార్మికవర్గం-ప్రజల అసహ్యానికి గురైన, అణచివేత పాలన సాగించిన సామ్రాజ్యవాదులను, భూస్వాములను, పెట్టుబడిదారులను అధికారం నుండి కూలద్రోసి, రష్యాలో మొదటిసారిగా సామ్యవాద రాజ్యాన్ని నెలకొల్పారు. (అక్టోబర్ విప్లవంగా ఇది ప్రాచుర్యంలో వుంది.) ఈ గొప్ప విప్లవాన్ని సంస్మరిస్తూ సిపిఐ(ఎం-ఎల్) ఉత్తరప్రదేశ్ రాష్ట్రకమిటి, ఆ రాష్ట్ర రాజధాని లక్నో నగరంలో శాసనసభ ఎదుట ఒకరోజు ధర్నా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఆ విధంగా కార్మికుల, రైతుల, చిన్న వ్యాపారుల మరియు వివిధ సెక్షన్ల ప్రజానీకం యొక్క సమస్యలపై పాలకుల దృష్టి సారింపజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది.

సిపిఐ(ఎం-ఎల్) శ్రేణులతోపాటు, కార్మికులు, రైతులు మరియు ఇతర సెక్షన్ల ప్రజానీకమంతా ఏఐఎఫ్‌టియు-న్యూ, ఎఐకెఎంకెఎస్ పతాకాల క్రింద సమీకృతులై ఈ ప్రజాధర్నాలో పాల్గొన్నారు. కార్మికుల, రైతుల మరియు ఇతర సెక్షన్ల ప్రజల సాధారణ సమస్యలపై ఈ సంఘాలన్నీ ఒక మెమోరాండంను రూపొందించి సంబంధిత అధికారులద్వారా ముఖ్యమంత్రికి అందజేశాయి. కిసాన్ సంగ్రామ్ సమితియొక్క జోనాపూర్ జిల్లా కమిటి, జిల్లాలోని ప్రజల నిర్దిష్ట డిమాండ్స్‌తో కూడిన ఒక జాబితాను సమర్పించింది.

సామ్రాజ్యవాద, బడా కార్పొరేటు సంస్థల దోపిడీకి సేవ చేసేందుకు అభివృద్ధి పేరుతో సాగిస్తున్న భూ సేకరణలను ఆపివేయాలని, రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించరాదని; సమానపనికి సమానవేతనమివ్వాలని; 1980ల నాటి ధరలకే రైతులకు ఎరువులు, పురుగుమందులను సరఫరా చేయాలని; భూపరిమితి చట్టాల ప్రకారం తేల్చిన మిగులు భూములన్నిటినీ భూమిలేని నిరుపేదలకు -వ్యవసాయానికి, నివాసానికి పంపిణీ చేయాలని; పారిశ్రామిక, పారిశ్రామికేతర రంగాల్లో కాంట్రాక్టు కార్మికుల విధానాన్ని రద్దు చేయాలని; ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ధరలకు-తిరిగి వినియోగదారులకు పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకం ధరలకు మధ్య అంతరాలని అరికట్టాలని; ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పెరిగిపోతున్న కిడ్నాపులు, లూటీలు, హత్యలు వంటి నేరాలను నిరోధించాలని; కాన్పూరులో పత్తిమిల్లులకు చెందిన భూముల అమ్మకానికి అనుమతినియ్యరాదని; అధిక ధరలనరికట్టాలని; గొట్టపుబావులకు విద్యుత్తు సరఫరా అందించాలని; కాల్వల చివరి భూములకు నీటిని గ్యారంటీ చేయాలని; కరువు పీడిత రైతాంగ అప్పులు రద్దు చేయాలని ఈ ధర్నాలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి - ముఖ్యంగా - కాన్పూరు నుండి రైతులు, కార్మికులు ఈ ధర్నాలో పెద్దసంఖ్యలోపాల్గొన్నారు. కామ్రేడ్స్ ఎం. షమ్మి, దేవీ ప్రసాద్ శర్మ ఈ ధర్నాకు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సిపిఐ(ఎం-ఎల్) ఉత్తరప్రదేశ్ రాష్ట్రకమిటి కార్యదర్శి కా॥ బచావ్‌రామ్; పార్టీ కేంద్ర కమిటి సభ్యులు కామ్రేడ్ సురేంద్రసింగ్ ఖతియార్, షబ్బర్‌హుస్సేన్ - ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ✡

## బీహార్ — ప్రజా ప్రదర్శన-బహిరంగసభ

**పాట్నా, 7-11-12 :**

2012 నవంబర్ 7న-1917 మాహత్తర అక్టోబర్ విప్లవ దినాన -సిపిఐ (ఎం-ఎల్) బీహార్ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను వెల్లడి చేసేందుకు, బీహార్‌లోని కార్మికుల, రైతుల మరియు ఇతర సెక్షన్ల ప్రజానీకపు సమస్యలను ఎలుగెత్తి చాటేందుకు ప్రజాప్రదర్శన, బహిరంగసభ నిర్వహించాయి. 2500 మంది ప్రజానీకం పాట్నా వీధులలో సిపిఐ(ఎం-ఎల్) నాయకత్వాన ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్మికులు, రైతులు, యువత, మహిళలు మరియు ఇతర విభాగాల ప్రజానీకం ఎర్రజెండాలు, బ్యానర్లు ప్లకార్డులు చేబూని, బిగ్గరగా నినాదాలు చేస్తూ నిర్వహించిన ఈ ప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంది. అక్టోబర్ విప్లవానికి జేజేలు పలుకుతూ, ప్రజాసమస్యలు పరిష్కరించాలని, సామ్రాజ్యవాద దోపిడీ నశించాలని ప్రదర్శనలో పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో తూర్పు, పశ్చిమ చంపారన్ జిల్లాలు, సమస్తిపూర్, వైశాలీ, ముజఫర్‌పూర్, దర్భంగా, రోహతక్, కైమూర్, పాట్నా జిల్లాల నుండి ప్రజలు పాల్గొన్నారు. ప్రదర్శన షహీద్ భగత్‌సింగ్ చౌక్ నుండి ప్రారంభమై, ఆర్‌బ్లాక్ చౌక్‌లోని బహిరంగ సభాస్థలివరకు సాగింది. ప్రదర్శన ముందు భాగాన ప్రపంచీకరణ విధ్వంసకర విపరిణామాలను వివరించే ఒక వీధినాటకాన్ని ప్రజాకళాకారులు ప్రదర్శిస్తూ సాగారు. ప్రజాకళాకారుడు కా॥ బసు(ఒడిషా) విప్లవగీతాలతో ప్రజలను ఆకట్టుకున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) బీహార్ రాష్ట్ర కార్యదర్శి కా॥ ఎస్.డి. బోస్; పార్టీ కేంద్రకార్యనిర్వాహక కమిటి సభ్యులు కా॥ అరవింద్ సిన్హా; కేంద్ర కమిటి సభ్యులు కా॥ శ్యామ్‌సుందర్ భగత్; మరియు సిపిఐ(ఎం-ఎల్) బీహార్ రాష్ట్ర నాయకులు కా॥ నందకిషోర్‌సింగ్, కా॥ త్రిభువన్‌రాయ్, కా॥ శివలాల్ ప్రభాత్ ఈ బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు.

సామ్రాజ్యవాద - ఫ్యూడల్ ప్రయోజనాలకు సేవజేస్తూ అణచివేత విధానాలు అవలంబిస్తున్న నితిష్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రభుత్వ పాలనలో ప్రజలనుభవిస్తున్న సమస్యలను వక్తలు తమ ప్రసంగాల్లో వివరించారు. పేదరికం, నిరుద్యోగం, అధికధరలు, విద్యుత్తు ఛార్జీల పెంపు, ఇతర జీవితావసరాల ధరలన్నింటి పెరుగుదలతో ప్రజాజీవనం దుర్భరమైంది. నిరుద్యోగులైన బీహార్ యువకులు జీవనోపాధిని వెదుక్కుంటూ లక్షల సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు తరలిపోతూ, ఆ ప్రాంతాల్లో తీవ్రమైన బాధలను, అవమానాలను ఎదుర్కొంటూ దయనీయమైన జీవితాలను గడుపుతున్నారు. సుపరిపాలన, అభివృద్ధి, ఉద్యోగహామీ పథకాలు, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, మహిళలకు, బలహీనవర్గాలకు రక్షణలు మొదలైన పాలకుల ఆర్భాటపు ప్రకటనలన్నీ ఆచరణలో మోసపూరితమైనవిగా రుజువు అవుతున్నాయి. నేరస్తులు, సంఘ వ్యతిరేకశక్తులు వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతుండగా, మహిళలు అత్యాచారాలకు, హత్యలకు పెద్ద ఎత్తున గురవుతున్నారు. 'అభివృద్ధి' అనే పదాన్ని-భూములు, ఉద్యోగాలు కోల్పోవటాన్ని తీవ్రం చేయటానికీ, పేదలకు కనీసపాటి ఇతర జీవనాధారాలన్నింటినీ తొలగించటానికీ, బహుళ జాతి పరిశ్రమలు, బడా కార్పొరేటు సంస్థలకు మన వనరులను దోచిపెట్టేందుకు అవకాశాల్ని అధికం చేసేందుకూ పర్యాయపదంగా మార్చారు. 89 శాతం బీహారు ప్రజానీకం గ్రామాల్లో నివశిస్తున్నారు. గ్రామీణ ప్రజానీకమే బీహారులో ప్రధాన ఉత్పాదక శక్తి. అయినప్పటికీ ప్రజలకు ఉపయోగమైన భూసంస్కరణలనేవి ఈనాటికీ చేపట్టబడలేదు, భూమిపై వ్యవసాయంజేసే వారికి ఈనాటికీ ఆ భూములపై హక్కు రాలేదు. నీటి పారుదల సౌకర్యాల కొరత, సాగునీటికి విద్యుత్తు ఛార్జీల మోత, విత్తనాలు, ఎరువులు, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు సతమతమౌతున్నారు. క్రమంగా పాలకుల విధానాల్ని ప్రజలు ప్రశ్నించటం పెరగటంతో ఇవన్నీ వెల్లడౌతున్నాయి. ఈ విధానాలపై ప్రజల నిరసన, ఆగ్రహం వివిధ రూపాల్లో బ్రద్దలవుతోంది. ఈ నిరసనలను అణచిపెట్టే విధానాలను అనుసరించటం ద్వారా, అవి మరింత నిరసనాందోళనలుగా పెల్లుబుకటానికి కారణమౌతున్నది. ఈ పోరాటాలను ముందుకు సాగించాలని వక్తలంతా పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదానికి సేవజేసే దళారీ బూర్జువా, భూస్వామ్య పాలనను అంతం చేయగలిగితేనే, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపించుకోగలిగితేనే, ఆ వ్యవస్థలో మాత్రమే ప్రజల మౌలిక సమస్యలన్నీ పరిష్కారం కాగలవని ఉద్బోధించారు. కమ్యూనిస్టు విప్లవకారులంతా ఒక వేదికమీదకు రావాలని, ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని ప్రజలను మరింత సంఘటిత, ఐక్యపోరాటాలకు నడపటం ద్వారానే ఈ లక్ష్యాన్ని చేరుకోగలుగుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా రాష్ట్ర వ్యాపితంగా కరపత్రాలు, పోస్టర్లతో విస్తృత ప్రచార క్యాంపైన్ సాగించారు. ✡

## బీహార్ — విద్యుత్తు ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ఆందోళన

నిరంతరాయంగా పెరిగిపోతున్న విద్యుత్తు ఛార్జీల పెంపుదల - బీహార్‌లోని వివిధ సెక్షన్ల ప్రజాజీవితాలకు తీవ్రవిఘాతంగా పరిణమించింది. ఈ పరిస్థితే-అత్యంత సహజంగానే ప్రజల తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. రాష్ట్రవ్యాపితంగా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఒక వేదికపైకి వచ్చి, రాష్ట్రవ్యాపిత ప్రచార క్యాంపైన్‌ను, నిరసన కార్యక్రమాలను నిర్వహించాయి. విద్యుత్తు ఛార్జీల పెంపుదలను సంపూర్ణంగా ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశాయి.

2012 ఆగస్టు-సెప్టెంబరు మాసాల్లో ఈ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం సాగింది. రాష్ట్రంలోని 38 జిల్లాలకుగానూ 37 జిల్లాలలో విద్యుత్తు ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ఉమ్మడిగా విస్తృత ప్రచారంసాగగా, 14 జిల్లాలలో ఆయా సంస్థల నిర్మాణాలు బలంగావున్నచోట్ల ప్రజలను కదిలించే వైపుగా, ప్రభావం నెరిపేదిశగా ప్రచారాందోళన సాగింది. సిపిఐ(ఎం-ఎల్) ఈ ప్రచార క్యాంపెన్‌లో 7 జిల్లాలలో పాల్గొనగా, ఐదు జిల్లాలలో పార్టీ క్రియాశీలమైన పాత్ర నిర్వహించింది. పశ్చిమ చంపారన్‌లో 2500 మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి, మిలిటెంట్ రూపంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రోహతక్ జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో 1000 మంది ప్రదర్శనలో పాల్గొన్నారు.

రెండు నెలల కాలం సాగిన ఈ ప్రచారం రాష్ట్ర ప్రజలపై మంచి ప్రభావం పడవేసింది. రానున్న కాలంలో సాగవలసిన సుదీర్ఘమైన, విస్తృత పోరాటానికి ఇది ఒక ఆరంభం మాత్రమే. ✡

---

**దోపిడీ వ్యవస్థ...** (మొదటి పేజీ నుండి)

అదే సమయంలో పురుషులు ఏరకమయిన దుస్తులైనా ధరించటానికి అనుమతించారు.

ఈ రకంగా అయినవారూ, కానివారూ, అధికారులూ, అనధికారులూ, పెత్తందార్లూ, పాలకులూ- అందరూ స్త్రీలపై లైంగిక అత్యాచారాలు జరగటానికీ, మానభంగాలు జరగటానికీ స్త్రీలే కారణమన్నట్టు నిందిస్తూ, స్త్రీలను సాటి మనిషిగా అంగీకరించాల్సిన అవుసరాన్ని నిరాకరిస్తున్నారు. ఘోరంగా కించపరుస్తున్నారు.

దీనికి తోడు "ఏ నేరాన్నుండయినా నష్టపరిహారం చెల్లించటంద్వారా విముక్తం కావచ్చు" అనే సామ్రాజ్యవాద కార్పోరేటు నీతి నేడు రాజ్యమేలుతోంది.

ఇటువంటి భావజాలన్నీ, దుష్ట సంస్కృతినీ నిరంతరం పెంచిపోషిస్తున్న ఈ పాలక వర్గపార్టీ నాయకులే, ఈ రోజున యిటువంటి దురంతాల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ దొంగేడుపులు ఏడుస్తూ యిందుకు తాము బాధ్యులము కామనట్లు నటిస్తున్నారు.

ఈ మధ్యయుగాలనాటి, ఫ్యూడల్, పితృస్వామిక, పురుషాధిక్య భావజాలానికీ, స్త్రీలను భోగవస్తువులు గానూ, వినిమయ వస్తువులుగానూ పరిగణించే సామ్రాజ్యవాద భావజాలానికీ వ్యతిరేకంగా పోరాడి, నిజమైన మానవ విలువలు, స్త్రీ పురుష సమానత్వపు విలువలు స్థాపించే-వివక్షత, అసమానత్వం లేని సామాజిక వ్యవస్థను స్థాపించేంతవరకూ, ఈ దుష్కృత్యాలు, దురంతాలు, దుర్మార్గాలు, దురాచారాలు యిలా పెరిగిపోతూ వుంటాయన్నదే చేదు నిజం.

అందుకే, వీటిని రూపుమాపే వ్యవస్థకోసం పోరాడటానికి నడుం బిగిద్దాం! ✡

# వివిధ ప్రపంచ దేశాలలో కార్మికుల ఆందోళనలు

## దక్షిణాఫ్రికా : లాన్‌మిన్ ప్లాటినం గనులలో నిరవధిక సమ్మె

ఆగస్టు 10న, దక్షిణాఫ్రికా దేశం-మారికానాలోని లాన్‌మిన్ ప్లాటినం గనులలో పనిచేసే కార్మికులు తమ వేతనాల పెంపుదలను, మెరుగైన జీవన, పని పరిస్థితులను డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. గుర్తింపు పొందిన, సాంప్రదాయక ట్రేడుయూనియన్ నాయకత్వం యాజమాన్యంతో చేతులు కలిపి ఈ సమ్మెను చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్నది. సమ్మెచేస్తున్న కార్మికులకు పోటీగా ఈ యూనియన్ నాయకత్వం, తమ సభ్యులను రంగంలోకి దించి సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేసింది. కానీ, ఈ పోటీ కార్మికులను ఆందోళన చేస్తున్న సమ్మెకారులు అడ్డుకున్నారు. ఈ సంఘర్షణల్లో దాదాపు ఆరుమంది కార్మికులు మరణించారు. దక్షిణాఫ్రికాప్రభుత్వం ఈ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు పెద్దఎత్తున పోలీసుబలగాలను, సైన్యాన్ని రంగంలోకి దించింది. ఆగస్టు 16న, కార్మికులపై పోలీసులు సాగించిన క్రూరమైన హత్యాకాండలో 36 మంది ఆందోళనకారులు మరణించారు. కానీ, సమ్మె చేస్తున్న కార్మికులు యాజమాన్యం యొక్క, పోలీసుల యొక్క తీవ్రమైన బెదిరింపులను సైతం లెక్కచేయకుండా చెక్కుచెదరని దృఢనిశ్చయంతో తమ సమ్మెను కొనసాగించారు.

పోలీసులు సాగించిన క్రూరమైన హత్యాకాండ, నిర్బంధాన్ని నిరసిస్తూ సెప్టెంబరు 5న వేలాది మంది సమ్మెచేస్తున్న కార్మికులు కర్రలు చేతబూని ప్రదర్శనలు నిర్వహించారు. శిరస్త్రాణాలు, కవచాలను ధరించిన పోలీసులతో కూడిన వాహనాలు, రెండు పోలీసు హెలికాప్టర్లు కార్మికుల సమ్మె ప్రదర్శనలను వెంబడించాయి.

లాన్‌మిన్ గని కార్మికుల సమ్మెకు మద్దతునివ్వటంతో పాటుగా, రాయల్ బబాఫోకెంగ్, ఆక్వారియస్ ప్లాటినం, క్రోమ్‌డాల్ ప్లాటినం, రుస్టెన్‌బర్గ్‌వద్దనున్న క్సాట్రాటా క్రోమ్‌గని, తెంబెలై గని వంటి ప్లాటినం గనుల కార్మికులు-తమ తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె బాటను చేపట్టారు.

సెప్టెంబరు 10న 15 వేల మంది బంగారు గని కార్మికులు ఈ కార్మికులకు సంఘీభావంగా సమ్మెచేశారు. 270 మంది మారికానా-లాన్‌మిన్ గనికార్మికులపై హత్యానేరాన్ని బనాయించిన దక్షిణాఫ్రికా ప్రభుత్వం-ప్రజలనుండి, కార్మికుల నుండి పెద్దఎత్తున వ్యక్తమైన నిరసనలు, ఆగ్రహంతో వెనక్కు తగ్గి, వాటిని ఎత్తివేసింది.

తిరిగి సెప్టెంబర్ 15న, మారికానా-లాన్‌మిన్ గని కార్మికుల ఆందోళనలపై పోలీసులు రబ్బరు తూటాలను ప్రయోగించి, కార్మికుల కాలనీలలో సోదాలు నిర్వహించి వారి వద్దనున్న సాంప్రదాయక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

లండన్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణాఫ్రికాలోని మరికానా గనులకు చెందిన, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద మైనింగ్ కార్పొరేట్‌గా పేరుగాంచిన లాన్‌మిన్ యాజమాన్యపు మొండివైఖరిని ఏమాత్రం లెక్కచేయకుండా; సాంప్రదాయక ట్రేడ్‌యూనియన్ నాయకత్వాల, పోలీసుల, సమ్మె విచ్ఛిన్నకారుల ప్రయత్నాలను వమ్ము చేస్తూ దృఢనిశ్చయంతో కార్మికుల సాగించిన నిరవధిక పోరాటం-యాజమాన్యం దిగివచ్చేట్లుగా చేయగలిగింది. యాజమాన్యం గని కార్మికుల వేతనాలను 22 శాతం పెంచేందుకు అంగీకరించి, తదనుగుణంగా సమ్మెచేస్తున్న కార్మికులతో ఒక ఒప్పందం చేసుకుంది. ఈ లాన్‌మిన్ ప్లాటినం గనులకు చెందిన 'గనులు తొలిచే కార్మికులు' తమ వేతనాలను నెలకు 12,500 రాండ్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె ప్రారంభించారు. యాజమాన్యంతో జరిగిన చర్చలలో 11,078 రాండ్ల నెలవేతనంగా ఇవ్వటానికి అంగీకరించటంతో గనులుతొలిచే కార్మికులు సమ్మెను ఆపివేసి సెప్టెంబరు 21న తమ విధులలో చేరారు.

## దక్షిణాఫ్రికా : బంగారు గని కార్మికుల ఆందోళనపై పోలీసు కాల్పులు

సెప్టెంబరు 3న, నెల్సన్ మండేలా మనుమడు మరియు దక్షిణాఫ్రికా ప్రస్తుత అధ్యక్షుని మేనల్లుడి యాజమాన్యంలోని అరోరా బంగారు గనిలో పోలీసులు జరిపిన కాల్పులలో నలుగురు గని కార్మికులు గాయపడ్డారు. మెరుగైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులను డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న గని కార్మికులపై పోలీసులు ఈ ఘాతుకానికి పాల్పడి, మరో నలుగురు కార్మికులను అరెస్టు చేశారు.

## దక్షిణాఫ్రికా : పోలీసులతో కార్మికుల సంఘర్షణ

అక్టోబరు 5న, ప్రపంచంలో అతిపెద్ద ప్లాటినం ఉత్పత్తి దారుడైన ఆంగ్లో-అమెరికన్ ప్లాటినం గని యాజమాన్యం దక్షిణాఫ్రికాలో 12 వేలమంది గని కార్మికులను తీసివేసింది. పోలీసులతో సాగిన సంఘర్షణలో ఒక గనికార్మికుడు హత్యగావించబడిన కొద్దిగంటలకే యాజమాన్యం ఈ నిర్ణయంతీసుకుంది.

## మెక్సికో : వెండి గనుల కార్మికుల నిరవధిక సమ్మె

జూలై 8వ తేదీ నుండి, మెక్సికోలోని లా ప్లాటోసా వెండిగనుల కార్మికులు నిరవధిక సమ్మెచేశారు. కెనడాకు చెందిన ఎక్సెలన్ రిసోర్స్ అనే ఈ కంపెనీ యాజమాన్యం గనులలో మరో యూనియన్‌ను రుద్దే ప్రయత్నాన్ని నిరసిస్తూ వారు సమ్మె చేపట్టారు. ఎట్టకేలకు ఆగస్టు 29 నాటికి 100 మంది పోలీసు అధికారులు, సైనికుల సహాయంతో, గనుల ప్రధానముఖద్వారం వద్ద కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాన్ని తొలగింపజేసి, అనేకమంది పోటీ కార్మికులను లోనికి ప్రవేశపెట్టగలిగారు. సమ్మెచేస్తున్న ఆందోళనకారులు, స్థానిక రైతుల మద్దతును పొందగలిగారు. గనియాజమాన్యం చేసిన వాగ్దానాలను నెరవేర్చక పోవటంపట్ల వీరంతా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

## బొలీవియా : బొగ్గు, జింకు గనుల కార్మికుల ఆందోళన

సెప్టెంబరు 11న, గనుల రంగంలోని ప్రైవేటు సహకార రంగంలో పనిచేసే వందలాదిమంది కార్మికులు, బొలీవియా రాజధాని లాపెజ్‌కు దోవతీసే మూడు ప్రధాన రహదారులపై పెద్దపెద్దరాళ్ళను అడ్డుగా పెట్టి-దిగ్బంధనం చేశారు. సెప్టెంబర్ 14న, 5వేలమంది సహకార రంగంలో పనిచేసే కార్మికులు బొలీవియా రాజధాని లాపెజ్‌లో కవాతు నిర్వహించారు. ఇదేరోజున దేశంలోని ఇతర నగరాలలోకూడా కోల్ క్విరిటిన్, మరియు జింకు గనులను జాతీయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. కోరురోలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో 'కోల్‌క్విరి గనులను జాతీయం చేయాల'ని నినదిస్తూ 300 మంది గృహిణులు తమ భర్తలతో గొంతుకలిపి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

## ఇటలీ : బొగ్గు గనుల మూసివేతకు నిరసన

ఆగస్టు 29న, సార్డీనియా బొగ్గుగనిని మూసివేస్తున్నట్లుగా ప్రకటించిన ఇటలీ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ 120 మంది గని కార్మికులు, 770 పౌండ్ల బరువున్న పేలుడు పదార్థాలను తమ వద్ద పెట్టుకుని, భూగర్భంలో 1300 అడుగుల లోతున వుండిపోయి బయటకు రాకుండా తమకు తాముగా ఖైదు చేసుకున్నారు. గనులను తిరిగి తెరవకుంటే తామంతా సామూహికంగా ఆత్మహత్యలకు పాల్పడవలసివస్తుందని హెచ్చరించారు. గనుల మూసివేత నిర్ణయం, గని కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసి, వారి జీవితాలను రోడ్లపైకి విసిరివేస్తుంది కనుకనే వారు ఈ చర్యకు తెగించారు.

## బెహ్రయిన్ : ఉద్యోగుల తొలగింపుకు నిరసన

జులై 30న, బెహ్రయిన్‌లోని రిప్కోలో 26 మంది కార్మికులు-సమాచార వ్యవహారాల విభాగాన్ని ప్రైవేటీకరించిన ఫలితంగా-ఉద్యోగాల నుండి తొలగించబడ్డారు. వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు బైఠాయించి ఆందోళన చేశారు.

## అమెరికా : వేరిజోన్ కార్మికుల ఆందోళన

మే 5న, అమెరికాకు చెందిన వేరిజోన్ కార్మికులు, హంట్స్ వ్యాలీలో కంపెనీ యాజమాన్యం సంవత్సరాంతంలో నిర్వహించే భాగస్వాముల సమావేశంవద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ పరిశ్రమలోని సిఇఓకు, ఇతర ఉన్నతాధికారులకు పెంచిన తీరులోనే తమ వేతనాలను కూడా పెంచాలని వీరు డిమాండ్ చేశారు. ప్రదర్శనకారుల నినాదాలు, అరుపులు, కేకలతో ఈ సమావేశం ఆరుసార్లు ఆగిపోయి, తిరిగి కొనసాగింది. కంపెనీ భాగస్వాములతో యాజమాన్యం సంవత్సరాంతంలో నిర్వహించే ఈ సమావేశం జరిగిన రోజునే ఇక్కడ నిర్వహించిన నిరసన ప్రదర్శనలతోపాటే దేశంలోని ఫిలడెల్ఫియా, మిన్నెయాపోలిస్, బోస్టన్, ఫారెస్ట్‌ల్యాండ్, మియామి, ఆర్లాండో వంటి 15 నగరాలలోకూడా కార్మికులు నిరసన ధర్నాలను నిర్వహించారు.

## కజకస్థాన్ : ఉక్కు కర్మాగార కార్మికుల ఆందోళన

మే 19న, కజకస్థాన్‌కు చెందిన అల్మటీలోని అర్సెలర్ మిట్టల్ ఉక్కు కర్మాగారంలో కార్మికులు సమ్మెచేశారు. వారు తమ వేతనాల పెంపుదలను డిమాండ్ చేశారు. పారిశ్రామిక నగరమైన టెమిర్టార్‌లో వారు ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. మూడువేలమందికి పైగా కార్మికులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

## ఇటలీ : అల్యూమినియం పరిశ్రమ కార్మికుల నిరసన - పోలీసులతో సంఘర్షణ

సెప్టెంబరు 10న, ఇటలీ రాజధాని రోమ్ నగరంలో అమెరికాకు చెందిన అల్యూమినియం ఉత్పత్తిదారు అయిన అల్కోవా పరిశ్రమను ఒక పథకం ప్రకారం మూసివేతకు గురిచేయటాన్ని కార్మికులు తీవ్రంగా నిరసించారు. ఆర్థికాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యాలయం ఎదుట ఒక అడ్డును నిర్మించే ప్రయత్నం చేశారు. ఈ నిరసన కార్యక్రమం పోలీసులతో తీవ్ర సంఘర్షణలకు దారితీసింది.

## ఇంగ్లాండ్ : ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఉద్యోగుల సమ్మె

సెప్టెంబరు 12న, ఇంగ్లండు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు చెందిన ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతను డిమాండ్ చేస్తూ సమ్మె చేసారు. 20 సం॥ల తర్వాత, ఈ ఉద్యోగుల తొలిసమ్మె ఇది. తమ ఉద్యోగాలలో కోతలు విధించటం ద్వారా 2.5 మిలియన్ డాలర్లను పొదుపు చేయాలనే యాజమాన్యపు కుటిల విధానాలను వీరు తీవ్రంగా నిరసించారు. ప్రపంచవ్యాపితంగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ యొక్క ఇతర కార్యాలయాల ఉద్యోగులందరూ వీరి ఆందోళనకు మద్దతుగా నిలిచారు.

## పరాగ్వే : కార్మికుల, రైతుల ఐక్య ఆందోళన

సెప్టెంబరు 19న, పరాగ్వేకు చెందిన అనేక ట్రేడు యూనియన్లు, రైతు యూనియన్లు 'అసెన్సియన్ ఆఫ్ పరాగ్వే' వద్ద ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. రాజకీయపరమైన కారణాలతో, వివక్షతో ఉద్యోగులను తొలగించటం; మహిళా కార్మికులు గర్భందాల్చారని, నియమాలను ఉల్లంఘించారనే పలు అత్యల్ప కారణాలతో ఈ చర్యలకు పాల్పడటాన్ని వారు తీవ్రంగా నిరసించారు. ఉద్యోగాలనుండి తొలగింపబడిన కార్మికులకు సంఘీభావంగా, మెట్రోపాలిటన్ చర్చివద్దకు రైతులంతా సమీకృతులయ్యారు.

## కాలిఫోర్నియా : వాల్‌మార్ట్ గోడౌన్ల కార్మికుల సమ్మె

సెప్టెంబరు 12న, కాలిఫోర్నియాలోని లోమాలిండాలోని గోదాములో పనిచేసే 30 మంది కార్మికులు తమ విధులను బహిష్కరించారు. వాల్‌మార్ట్ సంస్థకు చెందిన సరుకులను ఈ గోడౌన్లలో నిల్వవుంచి, ఓడలలోకి చేరవేస్తారు. విధులనుండి తొలగించబడిన కార్మికులు 6 రోజులపాటు, 50 మైళ్ళదూరంలోని లోసాఫుల్స్‌కు ప్రదర్శన నిర్వహించారు. వీరు తమ వేతనాల పెరుగుదలను, పని పరిస్థితుల మెరుగుదలను డిమాండ్ చేయటంతో పాటు, 100 డిగ్రీల ఉష్ణోగ్రత దగ్గరలో కంటైనర్ల లోపలి భాగంలో శ్రమచేయటాన్ని వారు వ్యతిరేకించారు.

## చికాగో : వాల్‌మార్ట్ గోడౌన్ కార్మికుల ఆందోళన

సెప్టెంబరు 20న, ఎల్‌వుడ్‌కు చెందిన వాల్‌మార్ట్ గోడౌన్ కార్మికులు 50 మంది చికాగోవద్ద వాల్‌మార్ట్ ఎక్స్‌ప్రెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు అర్ధగంట సేపు వారు ఈ మొత్తం స్టోర్స్‌ను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. వీరు సెప్టెంబరు 15 నుండి ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. చికాగోకు చెందిన వాల్‌మార్టు స్టోర్ కార్మికులు తమ వేతనాలకోసం, మెరుగైన పని పరిస్థితులకోసం డిమాండ్ చేస్తూనే ఎల్‌వుడ్‌లోని వాల్‌మార్ట్ కార్మికులు సాగిస్తున్న ఆందోళనకు మద్దతుగా నిలిచారు.

## తైవాన్ : హాన్‌హాయ్ పరిశ్రమ కార్మికుల నిరసనాందోళన

ప్రపంచంలోనే ఎలక్ట్రానిక్ వస్తువుల సరఫరాలో అతిపెద్ద పరిశ్రమగా పేరున్న; ప్రపంచ ఎలక్ట్రానిక్ రంగంలో ప్రపంచ దిగ్గజాలైన ఆపిల్‌తో సహా పలు సంస్థలకు సరఫరాదారుగా నున్న ఫాక్స్‌కాన్ పరిశ్రమకు చెందిన తైవాన్‌లోని హన్‌హాయ్ పరిశ్రమలో 79 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 2వేల మందికి పైగా కార్మికులు, కంపెనీకి చెందిన 1500 మంది రక్షణ బలగాలతో పోరాటం సాగిస్తూవస్తున్నారు. పరిశ్రమలోని ఒకానొక విశ్రాంతి గదిలో ఒక చిన్న సమస్యను సాకుగా చేసుకొని సెక్యూరిటీ గార్డులు కార్మికులతో వివాదపడి దాన్ని పెంచి పెద్ద చేశారు. వేలాది మంది కార్మికులు తమ విధులను బహిష్కరించి, సెక్యూరిటీ బలగాలతో తలపడ్డారు. కార్మికులను అణచివేసేందుకు 5వేల మంది అర్ధసైనిక బలగాలను పిలిపించారు. వేతనాల పెంపును కోరుతూ, తమ బాధలను వ్యక్తీకరించే కార్మికులతో సెక్యూరిటీ బలగాలు ఘర్షణకు దిగాయి. దీనిని సాకుగా చేసుకొని యాజమాన్యం పరిశ్రమను మూసివేసింది. కార్మికుల పట్ల దురుసుప్రవర్తన, కార్మికులను దూషించటం, కార్మికుల భద్రతా చర్యల ఉల్లంఘనలనేవి ఈ పరిశ్రమలో సర్వసాధారణంగా జరుగుతుంటాయి. ఈ కారణంగానే భారీఎత్తు నిరసనలు తరచూ జరుగుతువుంటాయి. 2012 మార్చిలో వేతన వివాదం కారణంగా, ఈ పరిశ్రమ కార్మికులు సమ్మెలోకి వెళ్ళారు. శలవు రోజులలోనూ పనిచేయాలంటూ నాణ్యతని నియంత్రణ చర్యలను పెంచటాన్ని నిరసిస్తూ అక్టోబరు 6న, ఈ పరిశ్రమకు చెందిన వేలాది మంది కార్మికులు సమ్మెచేపట్టారు.

# వివిధ దేశాలలో ఉపాధ్యాయుల ఆందోళనలు

## ఆస్ట్రేలియా: విద్యా వ్యతిరేక విధానాలకు నిరసన

జూన్ 29న, ఆస్ట్రేలియా న్యూసౌత్‌వేల్స్ రాష్ట్రానికి చెందిన దాదాపు 50వేల మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పారిశ్రామిక న్యాయస్థానం సమ్మెను నిషేధించటాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన విద్యా వ్యతిరేక విధానాలను వారు వ్యతిరేకిస్తున్నారు. సిడ్నీతోసహా దేశంలోని 30 నగరాలలో ఉపాధ్యాయులు భారీ నిరసన ప్రదర్శనలను నిర్వహించారు. విద్యావ్యవస్థ ప్రయోజనాలకు తీవ్రవిఘాతం కల్గించే ప్రభుత్వ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## హోండురస్: వేతన బకాయిల చెల్లింపుకై మిలిటెంట్ నిరసన

ఆగస్టు 17న, హోండూరస్ నగరంలోని అనేక ప్రధానమైన సంతలన్నింటినీ వేలాదిమంది ఉపాధ్యాయులు చుట్టుముట్టి కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఉపాధ్యాయుల పెన్షను ప్రణాళికలో మార్పులుచేసే కొత్తచట్టాన్ని; ఉపాధ్యాయుల హక్కులను తక్కువచేసి, ప్రైవేటీకరణకు తలుపులు బార్లాతెరవటాన్నీ వీరు వ్యతిరేకిస్తున్నారు. దీర్ఘకాలంగా వున్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వీరు డిమాండ్ చేశారు.

## పెరూ: ఉపాధ్యాయుల ఆందోళనకు ప్రజల సంఘీభావం

సెప్టెంబరు 5న, పెరూలోని ఉపాధ్యాయులు-మెరుగైన వేతనాలు, అమలుకాకుండా ఉండిపోయిన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరవధిక సమ్మె చేపట్టారు. వేలాదిమంది ఉపాధ్యాయులు దేశవ్యాపితంగా ఈ సమ్మెలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 7న పార్లమెంటు వరకు వారు ఒక నిరసన ప్రదర్శనను నిర్వహించారు. సమాజంలోని వివిధ సెక్షన్ల ప్రజానీకం వీరి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు.

(తరువాయి 4వ పేజీలో)

# భారత దేశంలో కార్మికుల ఆందోళనలు

### జమ్ముకాశ్మీర్ : ఉద్యోగుల రాష్ట్రవ్యాపిత సమ్మె

ఏప్రిల్ 17న 4,50,000 మంది జమ్ముకాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, తమ ఉద్యోగ విరమణ వయసును 58 నుండి 60 సంవత్సరాలకు పెంచటాన్ని నిరసిస్తూ ఒకరోజు నిరసన సమ్మె నిర్వహించారు. రాష్ట్ర వ్యాపితంగా వారు అనేక నిరసన కార్యక్రమాలను చేపట్టి కొనసాగించారు.

### మహారాష్ట్ర : కార్మికుల నిరవధిక సమ్మె

మహారాష్ట్రలోని నాసిక్‌లోవున్న-న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజి పేర్కొన్న డబ్ల్యు.ఎన్.ఎస్. కంపెనీ కార్మికులు ఏప్రిల్ 29 నుండి నిరవధిక సమ్మె చేపట్టారు. వీరంతా తమ వేతనాల పెంపును డిమాండ్ చేయటంతోపాటు, ఐదుగురు తమ సహ కార్మికులను ఉద్యోగాలనుండి తొలగించటాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు.

### తమిళనాడు : కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఏప్రిల్ 21 నుండి తమిళనాడు-నైవేలీ లిగ్నైటు కార్పొరేషన్‌కు చెందిన కాంట్రాక్టు కార్మికులు, గడిచిన 24 నెలల్లో 480 పనిదినాలను పూర్తి చేసుకున్న కార్మికులనందరినీ రెగ్యులర్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేపట్టారు. మే 7న, ఎన్ఎల్‌సిలోని ఇతర ట్రేడుయూనియన్లు కూడా ఈ కాంట్రాక్టు కార్మికుల ఆందోళనకు సంఘీభావంగా నిలిచారు. మే 12న కడలూరు జిల్లా వ్యాపితంగా అన్ని బ్లాకులలోనూ నిరసన ప్రదర్శనలను నిర్వహించారు. జూన్ 3వ తేదీన సమ్మె ముగిసింది. కాంట్రాక్టు కార్మికుల ఇంటి అద్దెకు, బట్టల శుభ్రతకు ఇచ్చే ఆర్థిక సదుపాయాలను పెంచేందుకు అంగీకరించటంతోపాటు సమ్మెలోపాల్గొన్న కార్మికులందరికీ సమ్మెకాలపు వేతనం క్రింద ఒక్కొక్కరికి 25 వేల రూ॥ను చెల్లించేందుకు అంగీకరిస్తూ యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది.

తమిళనాడు రాష్ట్రంలోని యునైటెడ్ లేబర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో-కాంట్రాక్టు కార్మికుల సమస్యపై కోరగాదమ్, మారాయ్‌మలైనగర్, తిరువల్లూరు వంటి పారిశ్రామిక ప్రాంతాలలో జూన్ మొదటివారంలో మూడురోజుల పాటు నిరసనాందోళనలు జరిగాయి. ఈ పారిశ్రామిక ప్రాంతమంతా హ్యూండాయ్, నిస్సాన్, కాటర్‌పిల్లర్, నోకియా, ఫాక్సకాన్ వంటి పలు బహుళజాతి పరిశ్రమలకు కేంద్రంగా వుంది.

### గుజరాత్ : టెక్స్‌టైల్స్ మిల్లు కార్మికుల ఆందోళన

జూన్ 4న, అహమ్మదాబాద్‌లోని నరోడావద్దనున్న అరవింద్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ కార్మికులు ఐదువేలమంది, తమ వేతనాల పెంపును డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెకు వెళ్ళారు. సమ్మెచేస్తున్న కార్మికులను తొలగించి, నూతనంగా కార్మికులను పనిలో చేర్చుకుంటామని మొదట్లో యాజమాన్యం ఆందోళన చేస్తున్న కార్మికులను బెదిరించే ప్రయత్నం చేసింది. కానీ, జూన్ 30 నాటికి, యాజమాన్యం దిగివచ్చి కార్మికుల వేతనాలను పెంచుతూ సమ్మెచేస్తున్న కార్మికులతో ఒప్పందం చేసుకుంది.

జూన్ 14న రాయపూర్‌వద్దనున్న అరవింద్ టెక్సుటైల్స్‌కు చెందిన అంకుర్ అనే ఓ పరిశ్రమలో పనిచేసే 1500 మంది కార్మికులు -రాయపూర్‌లోని ఇతర పరిశ్రమల కార్మికులు వారి వేతనాలను పెంచుకున్న నేపథ్యంలో- తమ యాజమాన్యం కూడా వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మెచేశారు.

### మహారాష్ట్ర : రైల్వే కార్మికుల నిరసన

జులై 20న ముంబయి-పశ్చిమ రైల్వేకు చెందిన 450 మంది మోటారు కార్మికులు మెరుపు సమ్మె చేసారు. ఈ సమ్మె కారణంగా పెద్ద సంఖ్యలో స్థానికంగా నడిచే రైలు బండ్లు ఆగిపోయాయి. సమ్మె చేస్తున్న కార్మికులు తమ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు యొక్క వేధింపులను నిరసిస్తూ, అతన్ని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

### మహారాష్ట్ర : నాసిక్‌లో పారిశ్రామిక కార్మికుల ఆందోళన

మహారాష్ట్రలోని పారిశ్రామిక నగరమైన నాసిక్‌లోని ఎవరెస్ట్ పరిశ్రమకు చెందిన కార్మికులు ఆగస్టు చివరివరకూ, దాదాపు 9 నెలల కాలం నిరవధిక సమ్మె చేశారు. వీరు తమ వేతనాలను పెంచాలని, తొలగించిన ముగ్గురు కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆగస్టు 28న ఈ సమ్మె తీవ్రరూపం దాల్చటంతో సహనాన్ని కోల్పోయిన ఆందోళనకారులు, డిప్యూటి హెచ్.ఆర్ అధికారితో సహా కంపెనీకి చెందిన ముగ్గురు ఉన్నతాధికారులను గాయపరిచారు. దీనితో, ఆందోళన సాగిస్తున్న ట్రేడుయూనియన్ సిఐటియు బాధ్యులు ఇరువురిని పోలీసులు అరెస్టు చేసారు. కానీ ఈ హింసాత్మక సంఘటనతో తమకేవిధమైన సంబంధంలేదని యూనియన్ నాయకత్వం ప్రకటించింది.

### మణిపూర్ : కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

జులై నుండి, మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని 'పునరుద్ధరించబడిన జాతీయ క్షయ నియంత్రణా కార్యక్రమం'లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు తమ వేతనాన్ని 30-40 శాతం తగ్గించటాన్ని నిరసిస్తూ సమ్మె చేశారు. దీనితో ఈ కార్యక్రమానికి సంబంధించిన పనులన్నీ ఆగిపోయాయి.

**ఉపాధ్యాయుల ఆందోళనలు....** (3 పేజీ తరువాయి)

### పరాగ్వే: బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులకై ఆందోళన

సెప్టెంబరు 12 నుండి, పరాగ్వేలోని 10వేలమందికిపైగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు దేశవ్యాపితంగా 3 రోజులు సమ్మె చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని, తమ వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పరాగ్వే రాజధాని అసుంకియాన్ చేరుకున్న నిరసనకారులు డౌన్‌టౌన్‌నుండి ఆర్థికమంత్రిత్వశాఖ వద్దకు, ఆపై నేషనల్ కాంగ్రెస్‌వద్దకు ప్రదర్శనగా వెళ్ళి తమ డిమాండ్లను తెలియపరిచారు.

### బంగ్లాదేశ్: ఉపాధ్యాయుల ఆరురోజుల సమ్మె

సెప్టెంబరు 9న, బంగ్లాదేశ్‌లోని 28వేల ప్రభుత్వేతర పాఠశాలలు , మదరసాలకు చెందిన 5 లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆరురోజులు సమ్మెచేశారు. వీరు జాతీయ విద్యావిధానం-2010ని త్వరితంగా అమలుచేయాలని, ఇంటి అద్దె అలవెన్స్ పెంచాలని, వైద్యం, పండుగల అలవెన్స్ పెంపుచేయాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబరు 10న చైనాలోని షాన్‌డాంగ్ రాష్ట్రంలో ఉపాధ్యాయుల వేతన బకాయిల విషయమై సుదీర్ఘ కాలంగా నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాలని, తమ సర్వీసులను గుర్తించాలని డిమాండ్‌చేస్తూ వేలాది మంది ఉపాధ్యాయులు నిరసనలు తెలియజేశారు.

### అమెరికా: 'విద్యా సంస్కరణలకు' వ్యతిరేకత

సెప్టెంబర్ 10నుండి 17 వరకు అమెరికా దేశం-చికాగోలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సమ్మె చేశారు. 'విద్యా సంస్కరణల'ను వీరు వ్యతిరేకించటంతోపాటు, మెరుగైన వైద్య సదుపాయాలు, పరిహారాన్ని, ఉద్యోగభద్రతను వీరు డిమాండ్ చేశారు. 29వేలమంది ఉపాధ్యాయులు మరియు వీరి మద్దతుదారులు ఈ సమ్మె, ఆందోళనల్లో పాల్గొన్నారు. గత 25 సం॥లలో ఉపాధ్యాయుల మొదటి సమ్మె ఇది. ప్రభుత్వం చేపట్టిన 'విద్యా సంస్కరణ'లనబడేవి-విద్యా ప్రమాణాలను దిగజార్చటమేకాకుండా, ఉద్యోగాలలో కోతల ఫలితంగా 6వేల మంది ఉపాధ్యాయులను రానున్న 2సం॥ల కాలంలో నిరుద్యోగులుగా మారుస్తాయని వీరు పేర్కొన్నారు. ఆందోళన సాగించే ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలకు సంబంధించి నిజాయితీతో కూడిన ఒప్పందాన్ని డిమాండ్ చేశారు. ✡

### కర్ణాటక : కాంట్రాక్టు కార్మికుల సమ్మె

బెంగుళూరులోని 'కాంట్రాక్టు కార్మికుల ట్రేడు యూనియన్' ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. కొన్ని బహుళజాతి పరిశ్రమలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను ఆకస్మికంగా తొలగించటాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. బెంగుళూరులో అనేక బహుళజాతి కంపెనీలు వందలాది మంది కాంట్రాక్టు కార్మికులను రాత్రికి రాత్రే పనిలో నుండి తొలగించి వేసి, వారి జీవనోపాధిని గుంజివేసి, వారి కుటుంబాలను చెప్పనలవి కాని బాధలకు గురిచేస్తూ వీధులపాలు చేసే చర్యలకు పాల్పడుతున్నాయి.

### ఢిల్లీ : కింగ్‌ఫిషర్ కార్మికుల ఆందోళన

ఏప్రిల్ నెలనుండి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన వివిధ విభాగాల ఉద్యోగులు, తమకు ఆనాటికి యాజమాన్యం బకాయిపడివున్న తొమ్మిదినెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్‌చేస్తూ పలుమార్లు సమ్మెలు చేశారు. వారి న్యాయమైన ఆందోళనను పరిగణలోకి తీసుకొని, వేతన బకాయిలను తక్షణమే చెల్లించకపోగా, కింగ్‌ఫిషర్ యాజమాన్యం కంపెనీ లాకౌట్ ప్రకటించి, అక్టోబరు 1 నుండి దాని కార్యక్రమాలను తాత్కాలికంగా రద్దుచేస్తూ ప్రకటించటం ద్వారా కార్మికుల నోళ్ళు మూయించాలని ప్రయత్నించింది. మరోవైపున కింగ్‌ఫిషర్ యాజమాన్యం తన కార్యకలాపాలన్నింటినీ రద్దుచేయటాన్ని నిరసిస్తూ ఆందోళనను తీవ్రంచేశారు.

### ఢిల్లీ : ఆందోళన చేస్తున్న కార్మికులకు సంఘీభావం

సెప్టెంబరు 7న, ఏఐసిసిటియు మరియు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్‌లు సంయుక్తంగా, మారుతి సుజుకి కార్మికులకు సంఘీభావంగా ఢిల్లీలోని సోషల్ ఇనిస్టిట్యూట్‌లో ఒక సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు మారుతీ కంపెనీ కార్మికులతోపాటు ఢిల్లీలోని ఎన్‌సిఆర్ ప్రాంతంనుండి కూడా కార్మికులు హాజరయ్యారు.

## ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుల ఆందోళనలు

### విద్యుత్తుశాఖ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌లోని యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్ నాయకత్వంలో విద్యుత్తు విభాగంలోని కాంట్రాక్టు కార్మికులు మే 23వ తేదీనుండి పనిముట్లను కిందపడవేసే 48 గంటలపాటు నిరసనాందోళనను నిర్వహించారు. వీరంతా జీ.వో.నెం.11 ప్రకారం విద్యుత్తు శాఖలోని కాంట్రాక్టు కార్మికులందరికీ వేరియబుల్ డి.ఏ.కనుగుణంగా చెల్లించవలసిన వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### సర్వీసునుండి తొలగించిన కార్మికుల ఆందోళన

శ్రీకాకుళంజిల్లా-పైడి భీమవరంవద్దనున్న ఆంధ్ర ఆర్గానిక్స్ కంపెనీకి చెందిన కార్మికులు వివిధ రూపాల్లో నిరవధిక ఆందోళన కొనసాగించారు. సర్వీసునుండి తొలగించిన కార్మికులను వెంటనే చేర్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరాహారదీక్షలతోపాటుగా, సమ్మెలు, రోడ్డు దిగ్బంధనాలు, జిల్లా కలెక్టరు కార్యాలయ ముట్టడులువంటి అనేక ఆందోళనా కార్యక్రమాలను జులై నెలలో నిర్వహించిన వీరు, ఆగస్టు 29న రాస్తారోకో నిర్వహించారు.

### కార్మికుల తొలగింపుకు వ్యతిరేకత

విజయనగరంజిల్లా, లక్కవరపుకోట వద్దనున్న శ్రీరామపురం 'స్టీలు ఎక్స్ఛేంజి ఇండియా' కంపెనీకి చెందిన కార్మికులు, తమతోటి కార్మికులు ఇరువురిని పనులనుండి తొలగించటాన్ని వ్యతిరేకిస్తూ, వారిని వెంటనే ఉద్యోగాలలో తిరిగి నియమించాలని డిమాండ్‌చేస్తూ ఫ్యాక్టరీ ఆవరణలోనే జులై 26 నుండి నిరవధిక ఆందోళన చేశారు.

### స్టీలుప్లాంటు కార్మికుల ఆందోళన

జులై 24న, విశాఖపట్నం స్టీలుప్లాంటులోని 12వేలమంది కార్మికులు , ప్రభుత్వం తన పెట్టుబడులను ఉపసంహరించటాన్ని నిరసిస్తూ ఒకరోజు సమ్మెచేశారు. ఇదేరోజున 20వేల మంది కాంట్రాక్టు కార్మికులు కూడా తమ విధులకు గైర్హాజరై, ఈ సమ్మెలో పాల్గొన్నారు.

### అపెరల్ పార్క్ కార్మికుల ఆందోళన

ఆగస్టు 10న, 'మేడ్చల్ అపరెల్ పార్క్'లోని కార్మికులు, దీనిలో పనిచేసే 800మంది కార్మికుల భవిష్యత్తును గాలిలో కలిపివేస్తూ యాజమాన్యం చట్టవిరుద్ధంగా ప్రకటించిన లాకౌట్‌ను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు.

### అరబిందోఫార్మా పరిశ్రమ కార్మికుల ఆందోళన

ఆగస్టు 29న శ్రీకాకుళంవద్దనున్న 'అరబిందో ఫార్మా లిమిటెడ్'కు చెందిన నాలుగువేలమంది కార్మికులు ఒకరోజు సమ్మె చేశారు. దీనికి ముందుగా యాజమాన్యం యూనియన్‌తో చేసుకున్న ఒప్పందాలను సైతం కాలరాచివేసి కార్మిక వ్యతిరేక విధానాలను అమలుచేయటాన్ని నిరసిస్తూ కార్మికులంతా రాస్తారోకో నిర్వహించారు. యాజమాన్యం కార్మికుల భద్రతా చర్యలను చేపట్టకుండా పూర్తిగా ఉల్లంఘిస్తున్నదని, రోజుకు ఒక్కో కార్మికునికి రెండువందల రూ॥లోపు మాత్రమే వేతనం లభిస్తున్నదనీ, అది కూడా నెలలో 20 రోజులకు మించి లభించటంలేదని కార్మికులు వెల్లడి చేశారు.

### మైక్రో ఫైనాన్స్ సంస్థ ఉద్యోగుల ఆందోళన

అనేకమంది మహిళల ఉసురుతీసిన, సామాజిక ఆందోళనకు కారణమైన ఎస్‌కెఎస్ మైక్రోఫైనాన్స్ సంస్థ, మే 2012న తనవద్ద పనిచేసే 1200 మందిని ఒక్కసారిగా తొలగించింది. ఎనిమిది గంటల పనిదినం బదులుగా 16 గంటల పనిదినాన్ని రుద్దటంతోపాటుగా మిగిలిన ఉద్యోగులందరి వేతనాలలో 8వేల రూ॥నుండి 5 వేల రూ॥వరకు కోత విధించింది. తొలగించబడిన కార్మికులు తమకు అధిక పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ✡




వెలువడింది నాల్గవ ముద్రణ
రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద
(వ్యాససంకలనం)
సిపిఐ (ఎం-ఎల్) ప్రచురణ
కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2
వెల: 15/-

తెలుగు - హిందీ - ఇంగ్లీషు భాషలలో



ప్రజాసాహితీ
సాంస్కృతికోద్యమం
కమ్యూనిస్టులు



కాపీలకు :
మైత్రీబుక్‌హౌస్
జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

## పెరుగుతున్న ...(చివరి పేజీ నుండి)

అవగాహన, ఆచరణ! కనుకనే వీరంతా కీలకమైన భూమి సమస్యను ఎజెండాగా చేయటంలేదని, అందుకే 'దున్నేవానికే భూమి' మన నినాదంగా వుండాలని, శాస్త్రీయమైన మార్క్సిజం సిద్ధాంత వెలుగులో పోరాటం సాగించాలన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో- పోస్కో వ్యతిరేక పోరాటం (ఒరిస్సా), కుడంకులం అణువిదుత్తు కేంద్రం వ్యతిరేక పోరాటం (తమిళనాడు) తదితర పోరాటాలన్నీ సామ్రాజ్యవాదులకు, బడాబూర్జువాలకు, భూస్వాములకు వ్యతిరేకంగా ఎక్కుబెట్టి సాగాలని ప్రొ॥ గోలక్ బీహారీనాథ్ పిలుపునిచ్చారు.

ప్రారంభసభకు అధ్యక్షత వహించిన కా॥ ఝాన్సి మాట్లాడుతూ సమస్యలను వేటికి వాటిని విడగొట్టి ఆందోళనలు సాగించటం సమస్యల పరిష్కారానికి దోహదంకాదని, సమస్యలకు మూలకారణమైన పాలకుల దోపిడీ విధానాలపై ఎక్కుపెట్టటం ద్వారానే వ్యవసాయ సంక్షోభం పరిష్కారమౌతుందని, అందుకు మరింత లోతైన, విస్తృతమైన, ఐక్యపోరాటాలను సాగించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో ఇంకా కా॥ శ్రీకాంత్ మొహంతి ఎఐకెఎంకెఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు(ఒడిషా), బాబూరావ్ కుంబర్‌గావ్ (మహారాష్ట్ర); కా॥ ఎం.ప్రసాద్ (కులనిర్మూలనా పోరాటసమితి కృష్ణాజిల్లా కార్యదర్శి), శ్రీఎర్నేని నాగేంద్రనాథ్ (రైతాంగ సమాఖ్య రాష్ట్రఅధ్యక్షులు) సౌహార్ద్ర ప్రతినిధులుగా సందేశాలిచ్చారు.

### 'జర్మనీలో రైతుయుద్ధం - పుస్తకాన్ని రైతాంగ కార్యకర్తలంతా అధ్యయనం చేయాలి'

**- డా॥ పి. జస్వంతరావు**



టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు ఇటీవల ప్రచురించిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచన 'జర్మనీలో రైతుయుద్ధం' పుస్తకాన్ని ట్రస్టు కార్యదర్శి, 'జనశక్తి' సంపాదకులు డా॥ పి.జస్వంతరావు ఈ సదస్సులో పరిచయం చేశారు. 1550లో జర్మనీలో రైతుల తిరుగుబాటు గురించి 300 సం॥ల తర్వాత 1860లో ఏంగెల్స్ ఈ పుస్తకంలో విశ్లేషణ చేశారన్నారు. జర్మనీలో ఆనాటికి పరిశ్రమలు అభివృద్ధి చెందినా అందుకు తగిన పెట్టుబడిదారీ వ్యవస్థ రూపుదిద్దుకోలేదని, అత్యధిక ప్రజానీకం భూమికి కట్టివేయబడ్డారని, విప్లవానికి నాయకత్వం వహించాల్సిన కార్మికవర్గం బూర్జువా వర్గం వెనకే నడిచిందని, కాగా-బూర్జువా వర్గం ప్రభువర్గంతో రాజీపడటంతో కార్మికవర్గం యొక్క, రైతాంగం యొక్క చారిత్రక పురోగమనానికి తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయని వివరిస్తూ, మనదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకుంటూ రైతాంగ ఉద్యమకార్యకర్తలంతా 'జర్మనీలో రైతుయుద్ధం' పుస్తకాన్ని అధ్యయనం చేయాల్సిందిగా డా॥ జస్వంతరావు పిలుపునిచ్చారు.

### 'తీవ్రమౌతున్న వ్యవసాయ రంగ సంక్షోభం- దళితులు, ఆదివాసులపై సాగుతున్న దోపిడీ, అణచివేత-కర్తవ్యాలు'

18వ తేదీ మధ్యాహ్నం ప్రారంభమైన రెండవ సెషన్‌లో వక్తలను రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ ఎమ్.ఎస్. నాగరాజు వేదికపైకి ఆహ్వానించగా, సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ బి. తిమ్మారెడ్డి, డి. వర్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

### 'అణచబడుతున్న ఏ కులానికి ఆ కులం తనంత తానుగా విముక్తి కాలేదు'

**-కా॥ విందై వేందన్**



'తీవ్రమౌతున్న వ్యవసాయరంగం సంక్షోభం- దళితులు, ఆదివాసులపై సాగుతున్న దోపిడీ, అణచివేత- కర్తవ్యాల'పై ఎఐకెఎంకెఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు కా॥ విందై వేందన్ మాట్లాడుతూ ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రంలో గతం నుండీ ఈ నాటికీ దళితులపై కొనసాగుతూ వస్తున్న దాడులను అనేక సంఘటనలను ఉదహరిస్తూ ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. 1967లో తంజావూరు ప్రాంతం- కీలవేన్మణి గ్రామంలో వ్యవసాయ కూలీలుగావున్న దళితులు సంఘంగా ఏర్పడి కూలీ పెంచమని అడిగినంతనే, అగ్రకుల భూస్వామ్య వర్గం ఆగ్రహించి దాడులకు తెగబడిందన్నారు. 44 మంది దళితులను ఒకే గుడిశలో పెట్టి నిప్పంటించి సజీవ దహనం చేశారని, ఇలాంటి దుర్మార్గాలు ఈనాటికీ కొనసాగుతున్నాయని, అగ్రకులాలవారి ముందు చెప్పులు వేసుకోరాదని, అంటరానితనం, దేవాలయ ప్రవేశం నిషిద్ధం వంటి అనేక విధి, నిషేధాలను అమలు చేస్తున్నారని పేర్కొంటూ అణచబడుతున్న ఏ కులానికి ఆ కులం తనంతతానుగా పోరాడటంతోనే విముక్తి సాధ్యం కాదని, సమాజంలోని ఇతర పీడితవర్గ ప్రజానీకమందరితో కలిసి పోరాడటం ద్వారానే; నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే కుల నిర్మూలనకు మార్గం సుగమమౌతుందని కా॥ వేందన్ బలంగా నొక్కి చెప్పారు.

### 'భూమికోసం-జీవించే హక్కు కోసం సాగించే పోరాటాలే పీడితులలో ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తాయి'

**-కా॥ యస్. ఝాన్సి**



రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సి ఈ అంశంపై మాట్లాడుతూ దోపిడీకి గురయ్యే అత్యధికులైన పీడితవర్గం-ప్రజల శ్రమ శక్తిని దోచుకుని తెగబలిసిన పిడికెడుమందిగా వున్న దోపిడీ వర్గాలుగా సమాజం విభజించబడి వుందనే శాస్త్రీయ విశ్లేషణ కలిగివుంటేనే నేటి సమాజ స్థితిగతులను సక్రమంగా అర్థంచేసుకొని, సరైన దిశలో పోరాటం చేయటం సాధ్యమౌతుందన్నారు.

'2002లో నరేంద్రమోడి ముఖ్యమంత్రిగా వుండి మైనారిటీ మతస్థులపై దాడులుచేయించి పెద్దఎత్తున వారిని హత్యగావించాడు - ఒకే సంఘటనలో 40 మంది ముస్లిములను గదిలో బంధించి, ఆ గదిలోకి నీరువదిలి, కరెంటు ప్రసారం చేసి, చిత్రహింసలకు గురిచేసి చంపారు.

ఒరిస్సాలో ప్రభుత్వమే గిరిజనులలో మతపరంగా చీలికలు తెచ్చి, క్రిస్టియన్ మతస్థులపై దాడికి పురికొల్పింది-ఘోరమైనదాడులు సాగాయి- పేడనీళ్ళుతాగించారు. నిండు చూలాలును కూడా చిత్రహింసలకు గురిచేసి చంపారు. మతకల్లోలాలని పేరుపెట్టి, వారిని విభజించేందుకు బహుళజాతి కంపెనీలు చేస్తున్న కుట్రఇది.

ఇక, ముస్లింలపైనా, దళితులపైనా ఎక్కడదాడి జరిగినా దానిలో మొదటగా బలవుతున్నది, మహిళలే. రాజ్యం స్వభావాన్ని గుర్తెరిగి, సమగ్ర దృష్టితో నిరంతరాయంగా సాగుతున్న ఈ దాడుల మూలాన్ని గుర్తించాలి. దళితులలో కొద్దిపాటి చైతన్యాన్ని కూడా సహించలేని అగ్రకుల పెత్తందారీ వర్గం మన రాష్ట్రంలో దళితులపై తెగబడి దాడులు చేస్తోంది. 'మీ శ్రమమీద మేము పెరుగుతాం. మీరు మాతోటి సమాన స్థాయికి చేరుకునే ప్రయత్నాన్ని సహించేదే లేదు' అని వారు అంటున్నారు. కారంచేడు, చుండూరు, నీరుకొండ.ఈ క్రమంలోనే ఈ సం॥ జూన్ 12న లక్షింపేట హత్యాకాండ చోటుచేసుకుంది. తమ భూమిని, ఇళ్ళను వదిలిపెట్టి వెళ్ళమంటూ కులదురహంకార పెత్తందార్లు దళితులపై ఈ దాడులు సాగించారు. లక్షింపేటలో మొత్తం ఆరుగురు దళితులను చాలాక్రూరంగా నరికి చంపారు. హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలి, లక్షింపేటలో ప్రత్యేక కోర్టునేర్పరచి న్యాయవిచారణ సత్వరం పూర్తి చేయాలనే కనీస, చట్టబద్ధ డిమాండ్స్‌ను కూడా నెరవేర్చేందుకు సిద్ధంకాని ప్రభుత్వం- ప్యాకేజీలు, గేదెలు, ఉద్యోగాల పేరుతో దళితులను మరోసారి దగా చేయటానికి ప్రయత్నిస్తోంది.

యస్‌సి యస్‌టిలపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టి వారికి రక్షణ కల్పించేందుకు 1992లో యస్‌సి యస్‌టి అత్యాచార (నిరోధక) చట్టం చేశారు. గత 20 సం॥లుగా ఆ చట్టం సక్రమంగా అమలు చేయబడటంలేదు. ఎక్కువ సందర్భాల్లో అది దోపిడీ వర్గానికి చుట్టంగా ఉపయోగపడ్తోంది. హక్కులకు గ్యారంటీ ఇస్తామంటున్న రాజ్యమే, పేదల హక్కులన్నింటినీ హరించివేస్తోంది. అందువలన, ఈ చట్టాల అమలుకై ప్రభుత్వాల మీద వత్తిడి చేస్తూనే, రాజ్యం యొక్క ప్రజావ్యతిరేక స్వభావం పట్ల స్పష్టతతో, చట్టభ్రమలలో కూరుకుపోకుండా, అప్రమత్తంగావుండి పోరాట మార్గాన సాగాలి.

అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న, ఆదివాసులకు కనీసపాటి రక్షణలు కల్పించే 1/70, 'పెసా', ఆదివాసీ హక్కుల చట్టాలవంటి వాటిని కూడా నీరుగారుస్తూ, ఏటవీభూములనన్నీ హారతి పళ్ళెంలో పెట్టి బహుళజాతి సంస్థలకు అప్పగించటాన్ని గమనిస్తే, పోరాటాలను మరింత తీవ్రం చేయాల్సిన ఆవశ్యకత స్పష్టమౌతుంది.

ఒడిషా ఆదివాసుల భూముల సమస్యపై ఆ రాష్ట్ర గవర్నరును కలిసి, రాజ్యాంగం ప్రకారం తనకున్న విశేషాధికారాలనుపయోగించి ఆదివాసులకు రక్షణ కల్పించాలని, ఆదివాసుల భూ బదలాయింపులను నిరోధించే 2/56 చట్టాన్ని అమలుచేయాలని కోరితే, ఆయనకు ఆ చట్టమొకటి వుందనే తెలియదన్నారు. ఇక వీరు ఆదివాసులకేమి భద్రత కల్పిస్తారు? కొండమొదలు, దుగ్గేరు, మనుగోపాల తదితర ప్రాంతాలలో ఎక్కడైనా పోరాడందే భూమి సాధించుకోలేదు-పోరాటంతోనే ఆత్మగౌరవమూ పెంపొందుతుంది.

లక్షింపేటలో ప్రత్యేక కోర్టు పెట్టలేకపోవటానికి కారణంగా లక్షింపేట దళితుల హత్యాకాండలో మొత్తంగా ఆరుగురిని హత్యగావించిన పెత్తందారుల భద్రత గురించి ప్రభుత్వం యోచిస్తున్నది. ఇది పాలకుల దోపిడీ వర్గ స్వభావాన్ని వెల్లడిచేస్తోంది.

ప్రజాస్వామిక వాదులుగా వుండి కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా, కొన్ని సందర్భాలలో దళితులకు, ఆదివాసులకు కనీస రక్షణలు కల్పించే చట్టాలను రూపొందించటంలోకూడా భాగస్వాములుగావున్న అతికొద్దిమంది సేవలను కూడా ప్రభుత్వం చట్టాలు చేయటం వరకే పరిమితం చేస్తోంది. అంతకు మించి మరో అడుగుముందుకు వేసి, వారు ఆ పీడిత ప్రజానీకపు పోరాటపక్షాన నిలబడితే, వారిని కూడా అత్యంతఘోరంగా అవమానిస్తోంది. పార్వతీపురంలో ఆదివాసుల పక్షాన ఆందోళనలో పాల్గొన్న ఐటిడిఏ రూపకర్తఅయిన యస్‌సి యస్‌టి కమీషన్ మాజీ అధ్యక్షులు డా॥ బి.డి.శర్మగారి నుండి ఆనాటి ఐటిడిఏ పి.వో. కనీసం వినతిపత్రం తీసుకోవటానికి కూడా సిద్ధం కాకపోవటమే దీనికి ఉదాహరణ. కనుక, రాజ్యం పీడితుల సమస్యలపట్ల ఎంతటి కర్కశంగా ఉంటుందనేది గమనించాలి. ప్రజాస్వామిక వాదుల సున్నిత ప్రజాస్వామిక మనస్తత్వాన్ని కూడా, ప్రజలకు చట్టాల పట్ల భ్రమలను పెంచేందుకు ప్రభుత్వం వంచనాత్మకంగా ప్రయోగిస్తోంది.

మనం ప్రజాస్వామిక, మేధావుల మద్దతును పొందుతూ-వ్యవసాయ కూలీలు, రైతులు, దళితులు, ఆదివాసుల భూమి సమస్య పరిష్కారం కోసం; జీవించే హక్కుకోసం పోరాట మార్గాన నిరంతరాయ కృషిసాగిస్తున్నాం. ఈ క్రమంలో పోలీసు, రాజ్యయంత్రాంగ అణచివేత, నిర్బంధాలు; ఫ్యూడల్ దాడులను ప్రతిఘటిస్తూ సాగుతున్న పోరాటం నుండే ఆయా సెక్షన్ల పీడితులంతా ఆత్మ గౌరవం పెంపొందించుకోగలుగుతున్నారు. భూమి సమస్యతో, ప్రజలఐక్య పోరాటంతో సంబంధంలేని ఆత్మగౌరవ నినాదాలు అంతిమ ప్రయోజనాన్ని సాధించలేవు. కనుక భూమికోసం, జీవించే హక్కు కోసం, మెరుగైన జీవనం కోసం పీడితులంతా సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని కా॥ ఝాన్సి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

### 'కోస్టలు, పెట్రోకారిడార్లు-సెజ్‌లు- థర్మల్, అణువిద్యుత్తు కేంద్రాలు- పాలకుల విధానాలు-ప్రజల కర్తవ్యాలు'

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్రసదస్సు రెండో రోజు (19వ తేదీ) సెషన్‌లో 'కోస్టలు, పెట్రో కారిడార్లు- సెజ్‌లు-థర్మల్, అణువిద్యుత్తు కేంద్రాలు- పాలకుల విధానాలు-ప్రజల కర్తవ్యాలు' అనే అంశంపై వక్తలు ప్రసంగించారు.

ఈ సెషన్‌లో వక్తలను రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఎస్. లలిత వేదికపైకి ఆహ్వానించగా, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఎమ్.డి. యాకూబ్‌లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

### 'అభివృద్ధి పేరిట ప్రజల జీవితాలతో నిమిత్తం లేని పాలకుల దళారీ విధానాలను ప్రతిఘటించాలి'

**-కా॥గుర్రం విజయకుమార్**



ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ గుర్రం విజయకుమార్ తన ప్రసంగంలో 1991 తర్వాత నుండీ పాలకులు- సామ్య వాదం, దేశీయత వంటి పదాల ప్రస్తావనను కూడా మరిచిపోయారని; భారత ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను సామ్రాజ్యవాద పెట్టుబడి స్వాధీనం చేసుకుంటోందని అనేక ఉదాహరణలతో వివరించారు. తడనుండి ఇచ్ఛాపురం వరకు-దాదాపు 1000 కి.మీ. తీర ప్రాంతాన్ని విదేశీ సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు పాలకులు పూనుకున్నారని, విశాఖజిల్లా పరవాడ పెట్రోరసాయన కాలుష్యం, నెల్లూరు జిల్లాలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్తు కేంద్రాల బూడిద కాలుష్యంతో ప్రజలు తీవ్ర అవస్థలనెదుర్కొంటు న్నారన్నారు. గుంటూరు- ప్రకాశం జిల్లాల్లో 'వాన్‌పిక్'కు 28 వేల ఎకరాల భూముల సేకరణను వ్యతిరేకిస్తూ ప్రజలు సాగించిన ఆందోళన ఫలితంగా కారిడార్ జీవోను ఉప సంహరిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. విదేశీ బహుళజాతి విద్యుత్తు అవసరాలకోసం, బడాబొగ్గు సంస్థల వ్యాపారం కోసం మర్చంటు థర్మల్ విద్యుత్తు కేంద్రాలు స్థాపిస్తున్నారని; వివిధ ప్రపంచదేశాలు వ్యతిరేకిస్తున్న అణువిద్యుత్తు కేంద్రాలను రణస్థలం వంటి ప్రాంతాల్లో నిర్మించ పూనుకుంటున్నారని, వీటినన్నింటినీ ప్రతిఘటించటం మినహా ప్రజలకు మరోమార్గం లేదని స్పష్టం చేశారు.

### 'చైతన్యవంతులైన ప్రజలశక్తి ముందు ఏ దళారులూ నిలబడలేరు'

**-కా॥ ఎస్. ఝాన్సి**

ఏ పాలకపార్టీ అధికారంలో వున్నా, సహజసంపదల దోపిడీ ప్రవాహం పెద్ద ఎత్తున సాగుతోందన్నారు. ఎలాంటి నియమ, నిబంధనలకు లోబడకుండా, వేల, లక్షల కోట్లు కొల్లగొట్టుకోడానికి బడావ్యాపారులను అనుమతించిన పాలకులు, మరోవైపున పేదప్రజలకు కిలోబియ్యమివ్వటానికి గుర్తింపుకార్డుల పేరిట సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రజల సంపదలను కొల్లగొడుతూ, మరోవైపు ప్రజలను వారు విసిరే ఎంగిలిమెతుకులకోసం ఎదురుచూసే బిచ్చగాళ్ళుగా మార్చజూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ చైతన్యంతో మన సంపద మనకు దక్కాలని పూనిక వహించి ప్రజలు ఆందోళనలు సాగించాలని పిలుపునిస్తూ, చైతన్యవంతులైన ప్రజలశక్తిముందు ఏ దళారీలూ నిలబడలేర'ని కా॥ ఝాన్సి నొక్కి చెప్పారు.

### 'దేశ సంపదలన్నీ దేశప్రజలకే చెందాలని పోరాడాలి'

**-కా॥ జె. కిషోర్‌బాబు**



నీటి వనరులు తగ్గిపోతున్నాయంటూ, నీటిపై నియంత్రణలు విధించి ప్రజల నుండి, రైతుల నుండి నీటి ఛార్జీలు వసూలు చేస్తున్న పాలకులు, ప్రజల - దేశ అవసరాలకు అత్యంత ఆవశ్యకమైన ఇనుపఖనిజాన్ని విచ్చలవిడిగా కొల్లగొట్టడానికి మనరాష్ట్రంలో గాలి జనార్దనరెడ్డికి అనుమతిచ్చారని రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ కిషోర్‌బాబు తీవ్రంగా విమర్శించారు. టన్నుముడి ఇనుపఖనిజానికి ప్రభుత్వానికి 27 రూ॥ మాత్రమే చెల్లించి, చైనాకు మాత్రం టన్ను రూ. 7000కు అమ్ముకొని, వేలకోట్ల రూపాయల ప్రజాసంపదను, ప్రభుత్వ ధనాన్ని గాలిజనార్దనరెడ్డి కొల్లగొట్టాడని, దీనిలో పైనుండి క్రింది దాకా అధికార పార్టీ నాయకులు, ఉన్నతాధికారులు అందరూ భాగస్వాములేనని వివరించారు. బాక్సైటు, మాంగనీసు, బొగ్గు, సున్నపురాయి తదితర గనులను ఈ తరహాలో కొల్లగొట్టటాన్ని నిరోధించాలని, ఈ దేశంలోని భూగర్భసంపద,సహజసంపద, వనరులన్నీ ఈదేశప్రజలకేచెందాలని ఉద్యమించాలన్నారు. →

# రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సదస్సు తీర్మానాలు

## 2012 డిసెంబరు 18,19 తేదీలు-విజయవాడ

### అభివృద్ధి పేరిట పాలకులు సాగిస్తున్న విధ్వంసాన్ని ఖండిస్తూ...

**1990ల** తర్వాత నుండీ సామ్రాజ్యవాదుల చొరబాటును తీవ్రం చేసే ప్రపంచీకరణ విధానాల అమలుతో పాలకులు, సామ్రాజ్యవాద గుత్తసంస్థల దోపిడీకి మరింత అవకాశాలు కల్పించే చట్టబద్ధ అనుమతులనిస్తూ వచ్చారు. 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళు -2005' చట్టంద్వారా మన దేశంలోనే 'విదేశీ రాజ్యాల' ఏర్పాటుకు అనుమతించారు. దేశవ్యాపితంగా సెజ్‌ల పేరిట, ప్రాజెక్టుల పేరిట', గనుల తవ్వకం పేరిట అభివృద్ధి పేరిట లక్షలాది ఎకరాలను సన్న, చిన్నకారు రైతాంగం నుండి గుంజుకొని బహుళజాతి, బడాసంస్థలకు కట్టబెడుతూ వస్తున్నారు.

మనరాష్ట్రంలో కోస్తా కారిడార్ పేరిట తీర ప్రాంతంలో వేలాది ఎకరాలను రైతులనుండి గుంజివేశారు. 'వాన్‌పిక్' పేరిట గుంటూరు-ప్రకాశం జిల్లాల్లో 28వేలఎకరాలను; గోదావరి తీరప్రాంతంలో పెట్రోకారిడార్ పేరుతో 10 వేల ఎకరాలను బడాసంస్థలకు కట్టబెట్టారు. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణం కోసమని వేలాది ఎకరాలను గుంజుకోవటానికి పూనుకున్నారు. చింతపల్లి తదితర ఏజన్సీ ప్రాంతాల్లో బాక్సైటు గనుల తవ్వకం పేరుతో; పోలవరం తదితర ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో వందలాది ఏజన్సీ గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు.

**ప్రజల వాస్తవ జీవితంతో సంబంధంలేని అభివృద్ధి పేరుతో సాగే విధ్వంసం ఇది.** అధికారం కోసం పాలకవర్గ ముఠాతగువుల్లో భాగంగా ఈ భూములకుంభకోణాలన్నీ బట్టబయలవుతున్నాయి.

**ఆదివాసులను అడవి నుండి, రైతులను భూముల నుండి గెంటివేయడాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సదస్సు తీవ్రంగా ఖండిస్తున్నది. ఇప్పటికే సన్న, చిన్నకారు రైతులనుండి, ఆదివాసుల నుండి గుంజుకున్న భూములనన్నీ స్వంతదారులకు, భూమిలేని నిరుపేదలకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నది.**

**ఉపాధి అవకాశాలను పెంచకపోగా, వున్న అరాకొరా ఉపాధిని కూడా తొలగించివేస్తూ; గ్రామీణపేదల, వ్యవసాయ కూలీల, ఆదివాసుల వలసలను తీవ్రం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని సదస్సు పిలుపునిస్తున్నది.**

### వ్యవసాయ రంగ సంక్షోభాన్ని తీవ్రం చేస్తున్న పాలకుల విధానాల్ని ఖండిస్తూ...

వ్యవసాయ ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర ఖర్చులన్నీ భారమవటం; సాగునీటి కొరత, వ్యవసాయ మోటర్లకు విద్యుత్తుకోత, అతివృష్టి, అనావృష్టి, తుఫాను, వరద, ముంపు వంటి అవరోధాలనన్నీ అధిగమించి చేతికొచ్చిన అరాకొరా పంటకైనా గిట్టుబాటు ధరలు కల్పించకుండా నిర్దాక్షిణ్యంగా సామ్రాజ్యవాద మార్కెట్టు శక్తులకు బలిచేస్తున్న ప్రభుత్వ విధానాలతో రైతాంగం రుణ ఊబిలో కూరుకు పోతున్నారు. పెద్ద సంఖ్యలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. **అందుకే రైతుల ఆత్మహత్యలన్నీ పాలకుల హత్యలే అని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు పునరుద్ఘాటిస్తున్నది.**

**రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయరంగ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేసే మరో పైరుపచ్చవిప్లవం, జన్యుమార్పిడి విత్తనాలకు ఆమోదం వంటి పాలకుల విధానాల్ని ఉపసంహరించుకోవాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు డిమాండ్ చేస్తున్నది.**

### లక్షింపేట దళితుల సమస్య పరిష్కారం పట్ల రాష్ట్రప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ...

ఈ సం॥ జూన్ 12న శ్రీకాకుళం జిల్లా లక్షింపేటలో కులదురహంకార పెత్తందార్లు జరిపిన ఘోరమైన దాడి, ఐదుగురు దళితుల హత్య అందరి దృష్టిలో వున్నదే. ఆనాటి నుండీ రాష్ట్ర వ్యాపితంగా ముఖ్యంగా 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో విస్తృత ప్రచార ఆందోళన సాగుతూవస్తున్నది. లక్షింపేట దళితులకు - మునకకు గురికాని 250 ఎకరాల మడ్డువలస రిజర్వాయరు భూములపై హక్కు కల్పించాలని, లక్షింపేటలోనే ప్రత్యేక కోర్టు నేర్పరిచి దోషులను శిక్షించాలనే కనీస, చట్టబద్ధ డిమాండ్స్‌ను కూడా నెరవేర్చకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటాన్ని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు తీవ్రంగా గర్హిస్తున్నది. **లక్షింపేట దళితుల న్యాయమైన డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నది.**

దళితుల అభ్యున్నతి కోసమంటూ ప్రభుత్వం చేసిన 'యస్‌సి యస్‌టి సబ్‌ప్లాన్', కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సులు (జిఓ 1048/2007) వంటి చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేయటంతో పాటుగా, మౌలిక సమస్యల పరిష్కారం కోసం దళితులు పూనిక వహించాలి.

రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రెండుగ్లాసుల విధానం, అంటరానితనం, కులవివక్ష, వివిధ రూపాల్లో వెట్టిచాకిరీవంటి అన్ని ఫ్యూడల్ అణచివేత, పీడనలకు వ్యతిరేకంగా పోరాడాలని, **ఆధిపత్య కులదురహంకార శక్తుల నుండి విడగొట్టుకొని అన్ని కులాల్లోని పీడితులు, శ్రమజీవులైన పేదలు-కులద్వేషాలకు గురికాకుండా, దళిత శక్తులతో కలిసి దీర్ఘకాల ఐక్యఉద్యమాలు నిర్మించాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు పిలుపునిస్తున్నది.**

### రణస్థలం అణువిద్యుత్తు కేంద్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ...

సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకనుగుణంగా-ప్రకృతిని, ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని విధ్వంసం గావించే అత్యంత వినాశనకరమైన అణువిద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి పాలకులు తెగబడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా- రణస్థలం మండలం కొవ్వాడ వద్ద ప్రజల నిరసనలను బేఖాతరు చేస్తూ అణువిద్యుత్తు కేంద్ర నిర్మాణానికి పూనుకుని, సన్నాహాలను వేగిరం చేస్తున్నారు. లేని విద్యుత్తు కొరతను సృష్టించి, తిరిగి దానినే సాకుగా చూపి చౌకైన, ప్రమాదరహితమైన ప్రత్యామ్నాయాల జోలికే పోకుండా అణువిద్యుత్తు కేంద్రాలకు ప్రజామోదం పొందే కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. **అత్యంత వినాశకరమైన అణువిద్యుత్తు కేంద్రాల స్థాపనను రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు వ్యతిరేకిస్తున్నది.**

మరోవైపున, సామ్రాజ్యవాద కంపెనీల విద్యుత్తు అవసరాలకోసం మన రాష్ట్రం తీరప్రాంతంలో **ఇబ్బడిముబ్బడిగా బొగ్గు ఆధారిత వ్యాపార థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు అనుమతులివ్వటాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు ఖండిస్తున్నది.** శ్రీకాకుళంజిల్లా-సోంపేట, కాకరాపల్లిలలో థర్మల్ విద్యుత్తు కేంద్ర నిర్మాణాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై పోలీసులు కాల్పులు జరిపి మొత్తంగా ఐదుగురిని బలిగొన్నారు. విజయనగరం జిల్లా కోటిపాం వద్ద ఆల్ఫా ఇన్‌ఫ్రా ప్రాప్ ఆధ్వర్యంలో నిర్మించనున్న మెగా థర్మల్ విద్యుత్తు కేంద్రానికి వ్యతిరేకంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ప్రధాన భాగస్వామ్య సంస్థగా పోలీసు నిర్బంధాన్ని, పలు కేసులను ఎదుర్కొంటూ దీర్ఘకాలంగా ప్రజాందోళన సాగుతున్నది. **కోటిపాం థర్మల్ విద్యుత్తు కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆందోళనకారులపై బనాయించిన కేసులను బేషరతుగా రద్దు చేయాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు డిమాండ్ చేస్తున్నది.**

### ఆదివాసుల హక్కులను నీరు గార్చే కుట్రలను ఖండిస్తూ...

దశాబ్దాలుగా ఆదివాసులు సాగించిన అనేక పోరాటాల ఫలితంగా ఆదివాసులకు కనీసపాటి రక్షణలు కల్పించే 1/70 చట్టం, 'పీసా' చట్టం, ఆదివాసీ హక్కుల చట్టాలవంటి వాటిని పాలకులకు చేయక తప్పలేదు. అయితే, ఆ చట్టాలను క్రమంగా నీరుగార్చే చర్యలను చేపడ్తూ, వేలాది గ్రామాలనుండి ఆదివాసులను విస్థాపనకు గురిచేసే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతున్నది. ఆదివాసుల సమిష్టి జీవనాన్ని, వారి సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తున్న పాలకులే, అనాదిగా అడివితో సహజీవనం సాగిస్తున్న ఆదివాసులను నేరస్థులుగా చిత్రించే సాహసం చేస్తున్నారు. **ఆదివాసుల నిర్బంధ వలసలను తీవ్రం చేస్తున్న, ఆదివాసుల హక్కులను కాలరాచివేస్తున్న ప్రభుత్వ విధానాలను రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రసదస్సు తీవ్రంగా ఖండిస్తున్నది.**

### అరాకొరా సబ్సిడీలన్నింటినీ రద్దుచేసే 'నగదుబదిలీ' పథకాన్ని వ్యతిరేకిస్తూ...

ప్రపంచ బ్యాంకు షరతులను తు.చ. తప్పక పాటిస్తున్న పాలకులు, 'ప్రజాసంక్షేమం' అన్న మాటను ప్రభుత్వ పాలననుండి తొలగించేందుకు పూనుకున్నారు. క్రమంగా సబ్సిడీలన్నింటిలో కోతలు పెడుతూ, ప్రజలపై భారాలను పెంచుతూవస్తున్నారు. ప్రతిసేవనూ ఖరీదుతో కొనే సరుకుగా మార్చివేశారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో ప్రభుత్వం మనదేశంలో ఉత్పత్తి అయిన సరుకులను కూడా అంతర్జాతీయ మార్కెట్టు ధరలకు విక్రయిస్తూ, ధరలను ఆకాశాన్ని తాకించింది. ప్రజాపంపిణీ వ్యవస్థను క్రమంగా నీరుగార్చింది. ఫ్యూచర్ ట్రేడింగ్, ఫార్వర్డ్ ట్రేడింగ్‌లతో చట్టబద్ధ చీకటి వ్యాపారాన్ని అనుమతించింది. చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరవడం ద్వారా ఒకవైపు వినియోగదారులను, మరోవైపు రైతులను విచ్చలవిడిగా దోపిడీ చేసుకునేందుకు గుత్త సంస్థలను అనుమతించింది. కాంట్రాక్టు, కార్పొరేటు వ్యవసాయానికి చట్టబద్ధ అనుమతినిస్తూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 113ను విడుదల చేసింది.

మరోవైపున డీజిల్ ధరల పెంపు, రవాణాఛార్జీల రెట్టింపు, సబ్సిడీ వంటగ్యాసు సిలిండర్లలో కోత, 'ఇంధనఛార్జీల సర్దుబాటు' పేరిట మోయలేని విద్యుత్తు భారాల వడ్డింపులతో నిత్యజీవితావసర వస్తువుల ధరల భారాలతో ప్రజాజీవితాలను దుర్భరం చేసిన పాలకులు - పేద ప్రజానీకానికి ఇచ్చే సబ్సిడీలన్నింటినీ ఎత్తివేసే క్రమాన్ని వేగిరపర్చారు. అరాకొరా ఇచ్చే సబ్సిడీల మొత్తాన్ని సంబంధిత లబ్ధిదారుని ఖాతాలో వేసి, ప్రతిదీ మార్కెట్టు ధరకు కొనుగోలు చేసుకోవాలంటూ ఇటీవల ముందుకు తెస్తున్న 'నగదుబదిలీ పథకం' సారాంశంలో పేదలకిచ్చే అరాకొరా సబ్సిడీలన్నింటినీ ఎత్తివేసి, వారి జీవితాన్ని మరింత దుర్భరంజేసేదే.

**ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచి నిత్యావసరవస్తువులను, రైతులకు ఉత్పాదకాలను సబ్సిడీలతో అందించాలని; పెరుగుతున్న ధరలను అరికట్టాలని, నగదు బదిలీ పేరిట సబ్సిడీలన్నింటినీ ఎత్తివేసే కుట్రపూరిత విధానాలను ఓడించాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సదస్సు పిలుపునిస్తున్నది.** ✡

### 'వీరోచిత రైతాంగ ఉద్యమాల త్యాగపూరిత వారసత్వంతో ముందుకుసాగుదాం'

**-కా॥ కోటయ్య**



రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తికోసం; 'దున్నేవానికే భూమి' నినాదంగా 1946-51 మధ్య సాగిన వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధపోరాటం, నగ్జల్బరీ, శ్రీకాకుళ పోరాటాల వారసత్వాన్ని అందిపుచ్చుకొని రైతు, కూలీల మధ్యన, గ్రామీణ పేదలనడుమ ఉద్యమాలు సాగిస్తున్నామన్నారు. కొండమొదలు, పోలవరం, విజయనగరం జిల్లాలోను ఒరిస్సాలోనూ ఇంకా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఆ ఒరవడితోనే ముందుకు సాగుతున్నామని, గత 30 సం॥ కాలంలో అనేక ఆటుపోట్లను, విచ్ఛిన్నాలను ఎదుర్కొంటూనే, ప్రజలే నిజవీరులనే చారిత్రక సత్యాన్ని రుజువు పరుస్తూ ముందుకు సాగుతున్నామని ఉద్వేగ పూరితంగా పేర్కొన్నారు. చుట్టుముట్టిన సర్వవ్యాపిత సంక్షోభం నడుమ నిర్వహించుకున్న ఈ సదస్సు ద్వారా మన అవగాహనను మరింత మెరుగుపరచుకుని, కర్తవ్యాలను నిర్దిష్టంగా పునరుద్ఘాటించుకున్నామని, గ్రామస్థాయిలోని కార్యకర్తలసహా, నాయకత్వమంతా ఈ కర్తవ్యాలను చేపట్టి మరింత సంఘటిత, విస్తృత ఐక్యఉద్యమాలను, మిలిటెంట్ ఉద్యమాలను, దీర్ఘకాలం ప్రజలను నిలిపివుంచే విధంగా ఒక రాజకీయ పరిణితితో, త్యాగపూరితంగా పునరంకితమై కృషిచేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ కా॥ కోటయ్య ముగించారు.

రెండురోజుల సదస్సు అంశాలపై తీర్మానాలను సంఘం రాష్ట్ర కోశాధికారి కా॥ వై. సోని ప్రవేశపెట్టారు- **(తీర్మానాలను విడిగా అందిస్తున్నాం)**

స్ఫూర్తిదాయకంగా జరిగిన ఈ సదస్సులో ప్రజా కళాకారులు ప్రదర్శించిన 'కిందిరి', చుట్టుకాముడు, డప్పుల నృత్యాలు వంటి సాంప్రదాయక కళా ప్రదర్శనలు సదస్సు ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ రెండురోజుల సదస్సు నిర్వహణకు అన్ని విధాలుగా సహకరించిన వారందరికి రైతుకూలీసంఘం (ఆం.ప్ర) నాయకులు కా॥ ఎం. భార్గవశ్రీ కృతజ్ఞతలు తెలియజేశారు. ✡





తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురణ

**జర్మనీలో రైతుయుద్ధం**

**ఫ్రెడరిక్ ఏంగెల్స్ రచన**

పేజీలు : 216 వెల : రు. 80/-

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**

**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2**

**తెలుగు - హిందీ - ఇంగ్లీషు భాషలలో**



**అణచబడ్డ దళితులంతా తిరగబడండి**



కాపీలకు :
**మైత్రీబుక్‌హౌస్**
**జలీల్ వీధి,**
**కారల్‌మార్క్స్ రోడ్,**
**విజయవాడ-2**



# పెరుగుతున్న సామ్రాజ్యవాద చొరబాటుతో తీవ్రమౌతున్న వ్యవసాయరంగ సంక్షోభం రైతు, కూలీ, దళిత, ఆదివాసీ ప్రజలముందున్న కర్తవ్యాలు

## స్ఫూర్తి దాయకంగా జరిగిన రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సదస్సు






వేదికపై ఎడమనుండి కె.ఆర్. చౌదరి, ఎస్. ఝాన్సి, గోలక్ బీహారీనాథ్, వింధై వేందన్, విజయకుమార్, జస్వంతరావు (వెనుక వరుస) శ్రీకాంత్, భార్గవశ్రీ, కిషోర్; సదస్సుకు హాజరైన ప్రతినిధులు

**విజయవాడ, 2012 డిసెంబరు 18,19 తేదీలు :** 'పెరుగుతున్న సామ్రాజ్యవాద చొరబాటుతో తీవ్రమౌతున్న వ్యవసాయరంగ సంక్షోభం - రైతు, కూలీ, దళిత, ఆదివాసీ ప్రజలముందున్న కర్తవ్యాలు' అనే అంశాలపై రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో డిసెంబర్ 18,19 తేదీలలో రాష్ట్ర సదస్సు జరిగింది. 18-12-12 ఉదయం 11 గంటలకు స్థానిక లారీ ఓనర్సు అసోసియేషన్ హాలులో ప్రారంభమైన ఈ సదస్సుకు రాష్ట్రం నలుమూలల నుండీ దాదాపు వెయ్యి మంది రైతు, కూలీ, ఆదివాసీ, దళిత ప్రతినిధులు; దళిత, ప్రజాసంఘల ప్రతినిధులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు, పురప్రముఖులు హాజరయ్యారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య సదస్సు ప్రాధాన్యతను వివరించి వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సి ఈ ప్రారంభసెషన్‌కు అధ్యక్షత వహించారు.

గత సంవత్సర కాలంలో పీడిత ప్రజా ఉద్యమాలలోనూ, పోలీసు హింసాకాండలోనూ, కులదురహంకార పెత్తందార్ల దాడులలోనూ అమరులైన వారందరికీ; ఇటీవలి నీలం తుఫాన్ మృతులకు-సదస్సు ప్రతినిధులంతా లేచినిలబడి 2 నిమిషాలు మౌనం పాటించి జోహార్లు చెప్పారు.

### 'ప్రపంచీకరణపై ఆధారపడిన వ్యవసాయ నమూనాను మార్చుకునేందుకు సంఘటిత పోరాటాలు సాగించాలి'

**-ప్రొఫెసర్ కె.ఆర్ చౌదరి**



సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తూ ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె. ఆర్. చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ రంగ సంక్షోభానికి కారణమైన పాలకుల విధానాలపై ధ్వజమెత్తారు. పాలకుల విధానాల ఫలితంగా 50 శాతం రైతులు వ్యవసాయాన్ని వదలి పారిపోవాలనుకుంటున్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోతూ... దీనికి పరాకాష్టగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో దాదాపు మూడులక్షల మంది రైతులు-వీరిలో ప్రధానంగా కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివరించారు. మన భారతదేశంలో 82 శాతం సన్న, చిన్నకారు రైతులేనని, వీరంతా యంత్రాలతో వ్యవసాయం చేయటం లేదు కనుక, వీళ్ళకు వ్యవసాయం నష్టదాయకమైందని పేర్కొంటూ దీనికి పరిష్కారం కార్పొరేటు వ్యవసాయానికి మళ్ళటమేనని సామ్రాజ్యవాదులు ప్రబోధిస్తున్నదానికనుగుణంగా పాలకులు విధానాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. 1991 నుండీ పాలకులు మనపై రుద్దిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో ప్రజా సంక్షేమం మరింత కొడిగట్టిందని, ప్రభుత్వరంగ సంస్థలను విదేశీకార్పొరేట్లకు అమ్మివేస్తున్నారని, విదేశీ దిగుమతులు పెంచారని, ఆహార ధాన్యాలను క్రమంగా తగ్గించే విధానాలను చేపట్టి పూర్తిగా దేశాన్ని, ప్రజలను పరాధీనం చేసే విధానాలను అనుసరిస్తున్నారన్నారు. జపాన్‌లో 80 నుండి 85 శాతం, యూరోప్‌లో 45 శాతం, చైనాలో 37 శాతం, పాకిస్తాన్‌లో సైతం 26 శాతం వ్యవసాయ సబ్సిడీలు ఇస్తూవుండగా మన దేశంలో వ్యవసాయ సబ్సిడీలు 3-4 శాతానికి మించటంలేదన్నారు. అమెరికావంటి దేశాల్లో 3.5 బిలియన్ డాలర్ల విలువగల పత్తి ఉత్పత్తికి 4.5 బిలియన్ డాలర్ల సబ్సిడీ ఇస్తూ, మరోవైపున మనదేశంలో సబ్సిడీలన్నింటినీ ఎత్తివేస్తున్నారన్నారు. పత్తిలో పంట నుండి మరలా మరలా విత్తనాలను తీసి ఉపయోగించుకోగల పత్తి విత్తనాల ధర కిలో 10-15 రూ॥ మాత్రమే ఉండేదని, హైబ్రీడ్ పత్తి విత్తనాల ధర కిలో రూ. 300గా వుండేదని, కాగా బి.టి. పత్తివిత్తనాలను 3 నుండి 4 వేల రూ॥కు అమ్ముతూ, అగ్రిబిజినెస్ కంపెనీలు తమ సూపర్ లాభాల సంపాదనకోసం పత్తికి బిటి తప్ప మరో గత్యంతరం లేకుండా చేశారన్నారు. బ్యాంకులు తమ మొత్తం రుణాల కేటాయింపుల్లో 18 శాతం వ్యవసాయరుణాలివ్వాల్సివుండగా, అది 10 నుండి 11 శాతం మించటం లేదనీ, ఈ మొత్తంలోనూ 20 శాతం మించి రైతులకు అందటం లేదనీ, మిగతా రుణాలన్నింటినీ వ్యవసాయం పేరిట అగ్రిబిజినెస్ కంపెనీలు పొందుతున్నాయన్నారు. గత 30 ఏళ్ళలో 40 కోట్ల మంది రైతులకు 70 వేల కోట్ల రుణాలను మాఫీ చేశామంటూ గొప్పగా ప్రకటిస్తున్న ప్రభుత్వం, రెండువందల బడా కార్పొరేటు సంస్థలకు ప్రతి ఏటా 88,263 కోట్ల రూపాయల పన్నులను మాఫీ చేస్తూ ప్రజలను దగా చేస్తున్నదని వివరిస్తూ, తక్షణ డిమాండ్స్ పరిష్కారంతోపాటుగా, ప్రపంచీకరణపై ఆధారపడిన వ్యవసాయ నమూనాకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రొ॥ కె.ఆర్. చౌదరి పిలుపునిచ్చారు.

### 'దున్నేవానికే భూమి' నినాదంతో ఫ్యూడల్ వ్యతిరేక పోరాటమే వ్యవసాయ సంక్షోభ పరిష్కారమార్గం'

**-ప్రొ॥ గోలక్ బీహారీనాథ్**

సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం (ఒరిస్సా) ఆర్థిక శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ గోలక్ బీహారీనాథ్ మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న విధానాలతో క్రమంగా భూమిహీనుల సంఖ్య పెరిగిపోతున్నదన్నారు. వ్యవసాయ కూలీల సంఖ్య



15 శాతం నుండి 2000 సం॥ నాటికి 35 శాతానికి పెరిగిందని; 1956లో భూమిహీనులు 58 శాతం వుండగా, 1964 నాటి 61 శాతమయ్యారని; 82 శాతం సన్న, చిన్నకారు రైతుల చేతుల్లో 20 శాతం భూమి వుండగా, కేవలం 18 శాతం చేతిలో 61 శాతం భూమి వుండటాన్ని బట్టి వర్గవ్యత్యాసాలు ఎంతగా పెరుగుతున్నాయో అర్థమౌతోందన్నారు. 1960ల మధ్యకాలంలో 'పైరుపచ్చ విప్లవం' పేరిట సామ్రాజ్యవాదుల నుండి దిగుమతి చేసుకున్న విధానాలన్నీ సారాంశంలో భూస్వాములకు, ధనిక రైతులకే ప్రయోజనకరమయ్యాయని, ఆ విధంగా పైరుపచ్చ విప్లవం మనదేశ వ్యవసాయరంగాన్ని ధ్వంసం చేసి, అధికోత్పత్తి వంగడాల పేరిట, రసాయన ఎరువులు, పురుగుమందుల పేరిట విదేశీ బహుళజాతి కంపెనీలపై ఆధారపడే విధంగా మలిచిందని 1970లలో కా॥ తరిమెల నాగిరెడ్డి ఎంతో శాస్త్రీయంగా చేసిన విశ్లేషణ ఈనాడు మరింత వాస్తవంగా మనకళ్ళముందు వుందన్నారు. మరోవైపున పీడితుల్లోకల్లా అధమాధమంగావున్న ఆదివాసులకు కనీస రక్షణ కల్పించే చట్టాలను, సుప్రీంకోర్టు తీర్పులను సైతం తుంగలోతొక్కి ఆదివాసులను పెద్ద ఎత్తున అడవుల నుండి విస్థాపనకు గురిచేస్తున్నారన్నారు. మౌలిక వసతుల కల్పన, రోడ్లు, ప్రాజెక్టులు, పార్కులు, గనులు, అభయారణ్యాలు తదితర పేర్లతో ప్రజాప్రయోజనం పేరిట విస్థాపనకు గురిచేస్తున్న వారిలో 49 శాతం ఆదివాసులేనన్నారు. అటవీభూములు, విశాల భూఖండాలు బహుళజాతి, బడాకార్పొరేట్ల పరమౌతున్నాయని, 1894 భూసేకరణ చట్టం స్థానంలో రూపొందించిన భూసేకరణ (పునరావాస) చట్టం-2011 కూడా మరింత త్వరితంగా ప్రజల భూములు గుంజుకోవటానికేనని స్పష్టం చేశారు. భూమిసమస్యను ఒక సాంకేతిక సమస్యగానో లేదా కేవలం ఆర్థిక సమస్యగానో చూడరాదని అది రాజకీయ సమస్య అని ఆయన నొక్కిచెప్పారు. ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోక పోవటం వల్లనే మన వ్యవసాయరంగం సంక్షోభంలో వుందనేది, పాలక, ప్రతిపక్ష పార్టీలన్నింటి **(తరువాయి 6వ పేజీలో)**



ప్రజాకళాకారుల డప్పునృత్యం

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010 and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*